గురువారం
04-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 283
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

ఇకపై 25 ఏళ్లకే సైన్యంలోకి...: ఉక్రెయిన్

కీవ్: రష్యా దురాక్రమణతో 25 ఏళ్ల వారిని సైన్యంలోకి తీసుకోవాలని ఉక్రెయిన్ నిర్ణయించింది. సైన్యంలో చేరేందుకు ఉన్న నిర్దేశిత వయస్సును 27 నుంచి 25కు తగ్గిస్తూ చట్టాన్ని ఇప్పటికే పార్లమెంటు ఆమోదం లభించింది. అయితే అధ్యక్షుడు ఆమోదంతో అది అమల్లోకి వచ్చింది. తాజా నిర్ణయంతో కొత్తగా సైన్యంలోకి ఎంత మంది వస్తారనే దానిపై అధికారికంగా సమాచారం లేదు. నేషనల్ గార్డ్‌తోపాటు ఇతర శాఖలు కలుపుకుంటే 10లక్షల మంది సైనికులు ఉన్నట్లు అంచనా. 25 ఏళ్ల వారిని సైన్యంలోకి తీసుకుంటే దేశ మానవ వనరులు తీవ్రంగా ప్రభావితమవుతాయన్న అభిప్రాయం ఉక్రెయిన్ ప్రజల్లో ఉంది.

పెన్షన్ కష్టాలు

- సచివాలయాల దగ్గర పడిగాపులు
- ఎండకు తట్టుకోలేక ముగ్గురి మృతి
- బ్యాంకుల నుంచి జమకాని నిధులు
- అక్కడక్కడా ఆలస్యంగా పంపిణీ
- ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/సూళ్లూరుపేట: మండుటెండ, ఉక్కబోత, తీవ్ర వడగాల్పుల నడుమ పెన్షన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు సహా లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. తమకు పెన్షన్ ఎప్పుడు వస్తుందో తెలియక అవ్వాతాతలు గంటల కొద్దీ నిరీక్షించి సొమ్మసిల్లి పడిపోయారు. అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో దిక్కుతోచని స్థితి నెలకొంది. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, రోగులు సైతం చాలా ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు అనారోగ్యంతో ఉన్న వృద్ధులను మంచాలపై మోసుకుంటూ గ్రామ సచివాలయాలకు బంధువులు తీసుకొచ్చి...పెన్షన్ల కోసం వేచి చూస్తున్న పరిస్థితులు కనిపించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసినా పెన్షన్లు అందకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. విధులకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో వలంటీర్లు విధుల్లో పాల్గొనలేదు. దీంతో పెన్షన్ల పంపిణీ చేయడం పెద్ద సమస్యగా మారింది. బుధవారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీకి ఎన్నికల సంఘం విధి విధానాలు ఖరారు చేసినప్పటికీ, ఆ ప్రక్రియ సవ్యంగా కొనసాగలేదు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల్లో పూర్తిస్థాయి పెన్షన్ల ప్రక్రియ కొనసాగలేదు. చాలా సచివాలయాల్లో సాయంత్రం నాలుగు

- మిగతా 2 లో

అనీరాజా నామినేషన్

- వయనాడ్‌లో గెలుపుపై ధీమా
- రాహుల్ గెలుపోటములపై చింతలేదని వ్యాఖ్య
- ఐదేళ్లలో ఇక్కడి ప్రజల్ని పట్టించుకోలేదని విమర్శ

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి సీపీఐ అభ్యర్థిగా ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, భారతీయ మహిళా జాతీయ సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ప్రధాన కార్యదర్శి అనీరాజ బుధవారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇక్కడి సిట్టింగ్ ఎంపీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఆమె పోటీపడుతున్నారు. మరోవైపు రాహుల్ గాంధీ కూడా ఈ స్థానం ఈరోజే నామినేషన్ పత్రాలు సమర్పించారు. కాగా

- మిగతా 2 లో

కేజ్రీవాల్ అరెస్టుపై
తీర్పు రిజర్వు

- కేసు విచారించిన ఢిల్లీ హైకోర్టు
- నన్ను అవమానించడమే ఉద్దేశం: కేజ్రీవాల్ వాదన

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చుట్టు న్యాయ ఉచ్చు బిగుసుకుంటోంది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన అరెస్టుకు గురై, ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. తన అరెస్టును సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ పిటిషన్ బుధవారం జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఢిల్లీ సీఎం తరపు వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును గురువారం మధ్యాహ్నం వరకు రిజర్వులో పెట్టింది. అంతకుముందు తనకు బెయిల్ మంజూరు చేయాలని కేజ్రీవాల్ కోరారు. దర్యాప్తు జరపకుండా, వాంగ్మూలం

- మిగతా 2 లో

బీజేపీలో చేరితో పవిత్రులేనా?

- ఈడీ, సీబీఐతో బెదిరింపులు
- కాషాయ కండువా కప్పకున్న విపక్ష నేతలపై చర్యలు శూన్యం

న్యూఢిల్లీ: అవినీతిపై పోరాటమని గొప్పగా చెప్పుకునే బీజేపీ...అదే కోవకు చెందిన అనేకమందిని తమ పార్టీలో చేర్చుకుంటుంది. ఇతర పార్టీల్లో ఉండగా అవినీతిపరులైన నాయకులు బీజేపీలో చేరగానే పవిత్రులుగా మారిపోతున్నారు. బీజేపీ ప్రత్యర్థి పార్టీల్లో ఉండగా సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను ప్రయోగించి వేధిస్తున్న కాషాయపార్టీ...తమ చెంతకు చేరగానే అన్నీ మర్చిపోతోంది. ఇందుకు అజిత్ పవార్, అశోక్ చవాన్, నవీన్ జిందాల్, గీత కొడా, గాలి జనార్ధనరెడ్డి వంటి అనేక మంది నాయకులు తాజా ఉదాహరణ. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతిపక్ష నేతలు బీజేపీ గూటికి చేరితే పవిత్రులుగా మారుతున్నారు. తాజాగా అవినీతి కేసులు ఎదుర్కొన్న 25 మంది నేతలు బీజేపీ కండువా కప్పుకోవడంతో కేసుల నుండి ఉపశమనం పొందినట్లు మీడియా విచారణలో తేలింది. బీజేపీతో చేరితే చట్టం కూడా తన తీరు మార్చుకుంటుందని స్పష్టమైంది. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం అబద్ధం కాదని రుజువవుతోంది. బీజేపీని 'వాషింగ్ మెషీన్'గా ప్రతిపక్షాలు విమర్శిస్తున్న విషయం విదితమే. 2014 నుండి అవినీతి కేసులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు ఎదుర్కొంటున్న 25 మంది ప్రముఖ రాజకీయ నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిలో పది మంది కాంగ్రెస్ నేతలు, ఎన్సీపీ, శివసేన (చీలికకు ముందు) పార్టీల నుండి నలుగురేసి చొప్పున, తృణమూల్ నుండి ముగ్గురు, టీడీపీ నుండి ఇద్దరు, ఎస్పీ, వైఎస్ఆర్‌సీపీ నుండి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీటిలో 23 కేసుల్లో వారి రాజకీయ ఎత్తుగడలతో ఈడీ, సీబీఐ నుండి ఉపశమనం పొందినట్లు విచారణలో తేలింది. వీటిలో మూడు కేసులు మూసివేశారు. మరో 20 మందిపై కేసు విచారణను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ జాబితాలో ఉన్న ఆరుగురు రాజకీయ నేతలు సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వారాల ముందు బీజేపీలో చేరారు. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 95 శాతం మంది ప్రముఖ ప్రతిపక్ష నేతలు ఈడీ, సీబీఐ దాడులు ఎదుర్కొన్నారని ఓ ఆంగ్ల పత్రిక 2022లో వెల్లడించింది. వరుసగా

- మిగతా 2 లో

సంజయ్ సింగ్ విడుదల

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు సంజయ్ సింగ్ తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఢిల్లీ మద్యం కేసులో సుప్రీంకోర్టు ఆయనకు మంగళవారం బెయిల్ ఇచ్చింది. దీంతో ఆయన విడుదలయ్యారు. జైలు వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న ఆప్ మద్దతుదారులు సింగ్‌కు ఘనస్వాగతం పలికారు. అయితే ఉదయం ఢిల్లీ కోర్టు విచారణ సందర్భంగా సంజయ్ సింగ్‌కు బెయిల్ ఇవ్వడానికి అభ్యంతరం లేదని ఈడీ తరఫున ఏఎస్‌జీ రాజు తెలిపారు. పాస్‌పోర్టు సమర్పించాలని, ఎన్సీఆర్‌ను వదలి వెళ్లాల్సి వస్తే ముందస్తు సమాచారం ఇవ్వాలని జస్టిస్ కావేరి బవేజా ఆయనకు ఆదేశించారు. బయటకు వెళ్లాక సాక్షులను ప్రభావితం చేయడం, ఆధారాలు నాశనం చేయడం వంటివి చేయొద్దని సూచించింది. సంజయ్ సింగ్ గతేడాది అక్టోబరు నుంచి జైల్లో ఉన్నారు. మద్యం కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ప్రతి ఇంటికి మంచి చేశా

- విజ్ఞతతో ఓటేయండి... వైసీపీని గెలిపించండి
- పూతలపట్టు సభలో సీఎం జగన్

విశాలాంధ్ర-చిత్తూరు: ప్రజలిచ్చిన అధికారంతో ఐదేళ్లుగా ప్రతి ఇంటికి మేలు చేశానని, 130 సార్లు బటన్ నొక్కి రూ.2.70 లక్షల కోట్లు నేరుగా పేదల ఖాతాలో జమ చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- మిగతా 2 లో

వణికిన తైవాన్

- దేశాన్ని కుదిపివేసిన శక్తివంతమైన భూకంపం
- 7.4 తీవ్రత నమోదు
- 25 ఏళ్లల్లోనే మొదటిసారి
- కూలిన భవనాలు, తొమ్మిది మంది మృతి
- 821 మందికి గాయాలు

2లో

అప్పుతో స్వాగతం

జగన్ సర్కార్‌పై రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి రోజునే ఆర్‌బీఐ నుంచి రూ.4 వేల కోట్ల అప్పు చేయడం ద్వారా నూతన ఆర్థిక సంవత్సరానికి స్వాగతం పలికిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ ప్రభుత్వం నానాటికీ రాష్ట్రాన్ని అప్పుల కూపంలోకి నెట్టేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ఆస్తులు, వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ సంస్థలు, ఏపీ ఫైనాన్సియల్ సర్వీసులు, సివిల్ సప్లయిస్, లిక్కర్ తదితర బాండ్ల ద్వారా రుణాలు, కార్మిక సంక్షేమ బోర్డు నిధులు, గ్రామ పంచాయితీల నిధుల మళ్లింపు, పబ్లిక్ ఖాతా ఫండ్, ట్రాన్స్‌కో, జెన్‌కోల ద్వారా తీసుకున్న మొత్తాలు తదితరాలన్నీ కలిపి ఏపీ అప్పు రూ.10 లక్షల కోట్లకు పైగా చేరిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితికి మించి ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తుండడం రాష్ట్ర ప్రభుత్వ తిరోగమన విధానాలకు తార్కాణం అన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించేందుకు కూడా అప్పులు వెదుకుతున్న దుస్థితి నెలకొనడంపై విచారం వ్యక్తం చేశారు. మార్చి 31నే ఆర్‌బీఐ నుంచి వెయ్యి కోట్ల రూపాయలు అప్పుతెచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏప్రిల్ 2న రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు వేలం వేసి మరో రూ.4 వేల కోట్లు అప్పు తెచ్చిందన్నారు. కాగ్ హెచ్చరికలను సైతం ఖాతరు చేయకుండా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తోందని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గుళ్లూ, గోపురాలు, దర్గాలకే కాదు కొంత టైము ప్రజలను దర్శిస్తే నాలుగు ఓట్లు పడతాయి!

కథ అడ్డం తిరిగింది

- ఒత్తిళ్లకు తలొగ్గని వలంటీర్లు
- రాజీనామాలకు ససేమిరా
- వైసీపీ నేతల్లో అంతర్మథనం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అనుకున్నదొక్కటి...అయినది వేరొక్కటి...బోల్తా కొట్టిందిలే వైసీపీ నేతల వ్యూహం. అధికార పార్టీ సొంత సైన్యంగా భావించే వలంటీర్లు అడ్డం తిరిగారు. ఏ సైన్యం అండతో ఎన్నికల బరిలోకి దిగాలనుకున్నదో అదే సైన్యం ఆ పార్టీకి దూరమైంది. ఉద్యోగాలకు రాజీనామా చేసి ఈ ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తలుగా పనిచేయాలని ఇప్పటికే ఆ పార్టీ నేతలు వలంటీర్లకు హితబోధ చేసినప్పటికీ కొంతమంది అడ్డం తిరిగినట్లు సమాచారం. వైసీపీ తన సైన్యం గా తయారు చేసుకొన్న 2.05 లక్షల మంది వలంటీర్లను ఎన్నికల సంఘం విధుల నుంచి తప్పించేసింది. దీన్ని అదునుగా భావించి వైఎస్సార్ కాంగ్రెస్ వీరందరి చేత రాజీనామాలు చేయించి పార్టీ పనులకు వినియోగించు కుందామనుకుంటే వారేమో మాట వినడం లేదు. ఒక వలంటీర్ ప్రభుత్వం తరపున 50 ఇళ్లకు ప్రతినిధి. అయితే వైసీపీకి సంబంధించి ఆ 50 ఇళ్లకు అసలు సిసలైన పార్టీ కార్యకర్తలు. పార్టీకి పనిచేస్తున్న ఐ ప్యాక్ బృందం వీరికి ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చి పనులు చేయిస్తూ వచ్చింది. నిజానికి వలంటీర్లు నెల మొదటి వారంలో ఇళ్లకు వెళ్లి పెన్షన్లు ఇవ్వడం, సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల చేత వేలి ముద్రలు వేయించడం వంటి పనులు చేసేవారు. ఆ తర్వాత వీరికి పెద్దగా పని ఉండేది కాదు. ఆ సయమంలో వీరితో పార్టీకి ఉపయోగపడే పనులు చేయించేవారు. ఎన్నికల సమయంలో వలంటీర్లే క్రీయాశీలకంగా వ్యవహరించేలా ప్రణాళికలను రూపొందించారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వలంటీర్లే ఓటర్లకు

- మిగతా 2 లో

బీజేపీలో చేరితో పవిత్రులేనా?

(మొదటిపేజీ తరువాయి)

2022, 2023 సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం మహారాష్ట్ర రాజకీయాలను లక్ష్యంగా చేసుకుంది. 2022లో ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేనపై తిరుబాటు ప్రకటించింది. మహా వికాస్ అఘాడీ (కాంగ్రెస్, శివసేన, ఎన్‌సీపీ) ప్రభుత్వాన్ని కూల్చివేసింది. తర్వాత బీజేపీతో చేతులు కలపింది. షిండే ముఖ్యమంత్రిగా, దేవేంద్ర ఫడ్నవిస్ ఉపముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. మరుసటి ఏడాది ఎన్‌సీపీలో చీలిక తెచ్చి... అజిత్ పవార్ వర్గం ఎన్‌డీఏ కూటమిలో చేరాలా చేసింది. దీంతో ఎన్‌సీపీ నేతలు అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్‌పై కేసులు మూసివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. 25 మందిలో మహారాష్ట్రకు చెందిన 12 మంది ప్రముఖ నేతలు ఉన్నారు. వీరిలో 11 మంది 2022, ఆ తర్వాత ఏడాదిలో శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీకి చెందిన నలుగురు సహా బీజేపీ పంచన చేరారు.

బీజేపీ గూటికి చేరిన 25 మందిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు నేతలు ఉన్నారు. బీజేపీలో చేరడంతో వారికి గల అవినీతి మరకను వదిలించుకున్నారు. వీరిలో టీడీపీ నుండి ఇద్దరు, వైసీపీ నుండి ఒకరు ఉన్నారు. ప్రస్తుతం ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. టీడీపీ, వైసీపీల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని బీజేపీలో చేరిన సుజనాచౌదరి, సీఎం రమేశ్, గీతలకు ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ టికెట్లు కేటాయించింది. బీజేపీ తరపున ఆ ముగ్గురు పోటీ చేస్తున్నారు. రూ.100 కోట్ల నగదు అవతవకలు జరిగాయంటూ టీడీపీ ఎంపీగా ఉన్న సీఎం రమేశ్‌కి చెందిన కంపెనీలపై 2018 అక్టోబర్‌లో ఐటి శాఖ దాడులు జరిపింది. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు పార్లమెంట్ నైతిక విలువల కమిటీకి లేఖ రాశారు. భారీ ఆర్థిక కుంభకోణాలతో 'ఆంధ్రా మాల్యాలు'గా పేరు గడించినందుకు ఆయనను ఎంపీగా తొలగించాలని కోరారు. అయితే 2019 జూన్‌లో సీఎం రమేశ్ బీజేపీలో చేరడంతో ఆయనపై ఐటీ దాడులు నిలిచిపోయాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. కేంద్ర మాజీమంత్రి సుజనాచౌదరిపై మూడు ఎఫ్‌ఐఆర్‌లు ఉన్నాయి. బెస్ట్ అండ్ క్రాంప్టన్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (బీసీఈపీఎల్) సుజనా చౌదరికి చెందినవని, బ్యాంకుల కన్సార్టియం నుండి మోసపూరితంగా రూ.360 కోట్లకు పైగా రుణాలు పొంది, డిఫాల్ట్ చేసిందని ఎఫ్‌ఐఆర్‌లు పేర్కొన్నాయి. 2016లో ఈడీ కేసు నమోదు చేయగా, 2018 అక్టోబర్‌లో ఆయన కంపెనీలపై ఈడీ దాడులు చేసింది. 2019 ఏప్రిల్‌లో రూ.315 కోట్లకు పైగా ఆస్తులు జప్తు చేసుకుంది. చార్జిషీటు నమోదైన అనంతరం 2019 జూన్‌లో బీజేపీ కండువా కప్పుకోవడంతో ఈ కేసు తిరిగి విచారణకు వెళ్లింది. ప్రస్తుతం సుజనా చౌదరి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికల బరిలోకి దిగారు. వైసీపీకి చెందిన గీతను మార్చి 28న బీజేపీ అరకు అభ్యర్థిగా ప్రకటిచింది. 2015 వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీగా ఉన్న సమయంలో వాస్తవాలు తప్పుగా చూపి, రూ.42 కోట్ల రుణాలు తీసుకుని పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేశారంటూ ఆమె సంస్థ విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కేసు నమోదైంది. గీత, ఆమె భర్త పి.రామకోటేశ్వరరావుపై 2015లో సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. 2019 జులైలో ఆమె బీజేపీలో చేరారు. 2022 సెప్టెంబర్‌లో ప్రత్యేక కోర్టు ఇద్దరికీ ఐదేళ్ల జైలుశిక్ష విధించింది. ఆ వెంటనే తెలంగాణ హైకోర్టు జైలు శిక్షపై స్టే విధించడంతో పాటు బెయిల్‌పై విడుదల చేసింది. ఈ ఏడాది మార్చిలో తెలంగాణ హైకోర్టు జైలు శిక్షపై మరోసారి స్టే విధించింది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు స్టేను సీబీఐ సవాలు చేసింది.

అనీరాజా నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

నామినేషన్ దాఖలు చేయడానికి ముందు అనీరాజా నియోజకవర్గంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... వయనాడ్‌లో తన గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. 'మీరు ఇక్కడకు పెద్ద సంఖ్యలో వచ్చిన ఎల్‌డీఎఫ్ కార్యకర్తలు, నాయకులు, సాధారణ ప్రజలను చూస్తున్నారు. నామినేషన్ దాఖలు చేసే ఈ రోజు ఎన్నికలకు ఎంతో ముఖ్యమైన రోజు అయినందుకు మేమంతా సంతోషిస్తున్నాము' అని రోడ్ షోలో పాల్గొన్న రాజా ఏఎన్ఐ వార్తాసంస్థతో అన్నారు. వయనాడ్ నుంచి సిట్టింగ్ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ కీలక అభ్యర్థి అయిన రాహుల్ గాంధీ గురించి రాజా మాట్లాడుతూ... అతని గెలుపోటముల గురించి తాను ఆలోచించడం లేదని... జాతీయ సమస్యలపై తన పార్టీ వైఖరి గురించి ప్రజలకు తెలియజేయడం ద్వారా మాత్రమే ప్రజలకు చేరువవుతానని స్పష్టం చేశారు. 'లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థిగా నేను గెలవడానికి ఇక్కడ పోటీ చేస్తున్నాను. అతని మెజారిటీ లేదా అతని భవితవ్యం గురించి నేను బాధపడటం లేదు. మేము ఇక్కడ ఉన్నాము, మేము ప్రజలకు చేరువవుతున్నాం. మా రాజకీయాలు ఏంటి? అన్ని జాతీయ సమస్యలపై మా వైఖరి స్పష్టం చేస్తున్నాం. ఫాసిజం, సంఘ్ పరివార్ పోకడలను వివరిస్తున్నాం. ప్రజల ప్రతిస్పందనపై మా మాకు నమ్మకం ఉంది. పోటీ చేసి గెలవడానికి మేము ఇక్కడ ఉన్నాం' అని రాజా పేర్కొన్నారు. ఓ ఎంపీగా వయనాడ్ రాహుల్ గాంధీ తీవ్ర నిర్లక్ష్యం చేశారని రాజా విమర్శించారు. 'ప్రజలు నా వద్దకు వచ్చి ఏం చెబుతున్నారంటే... గత ఎన్నికలకు ముందు ఆ గుర్తుకు (కాంగ్రెస్ పార్టీకి) ఓటు వేయలేదని... అయితే ఆయనే ప్రధాని అవుతానని వారికి చెప్పారు. కాబట్టి వారు అతనికి ఓటు వేశారు. కానీ ఏమైంది?' అన్నారు. వయనాడ్ అనే పేరుకు మలయాళంలో నాలుగు అక్షరాలు మాత్రమే ఉన్నాయని... ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆయన తన నియోజకవర్గం పేరు చెప్పలేదని ఆమె ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో 64.7 శాతంతో వయనాడ్‌లో 7,06,367 ఓట్లను సాధించారు. రెండో స్థానంలో నిలిచిన సీపీఐ అభ్యర్థి పీపీ సునీర్‌కు 25.1 శాతంతో 2,74,597 ఓట్లు సాధించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) 20 స్థానాలకు 19 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకోగా, దాని మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ రెండు సీట్లు, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఒకటి, కేరళ కాంగ్రెస్ (ఎం) ఒక సీటు గెలుచుకున్నాయి.

వయనాడ్ నుంచి పోటీ చేయడం గౌరవంగా భావిస్తున్నా: రాహుల్

నామినేషన్ సమర్పిస్తున్న రాహుల్

వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి రెండోసారి బరిలోకి దిగిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ టర్నింగ్ అధికారి అయిన వయనాడ్ జిల్లా కలెక్టర్‌కు నామినేషన్ సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ... '2024 ఎన్నికలు ప్రజాస్వామ్యంతోపాటు భారత రాజ్యాంగం కోసం జరుగుతున్న యుద్ధం. ఒకవైపు మన దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకునే శక్తులు ఉన్నాయి. మరోవైపు రాజ్యాంగాన్ని పరిరక్షించే కాపాడే శక్తి ఉంది. ఎవరు ఎటువైపు ఉన్నారో మీ అందరికీ చాలా స్పష్టంగా తెలుసు' అంటూ రాహుల్ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ నామినేషన్ కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్, కేరళకు చెందిన ఇతర ముఖ్యనేతలు హాజరయ్యారు. అంతకుముందు వయనాడ్‌లో రాహుల్ గాంధీ భారీ రోడ్‌షో నిర్వహించారు. దిల్లీ నుంచి ముప్పాయనాడ్ గ్రామానికి హెలికాప్టర్‌లో చేరుకున్న రాహుల్, రోడ్డు మార్గం ద్వారా కాల్‌పెట్ట వరకు వెళ్లారు. అక్కడి నుంచి ప్రారంభమైన రాహుల్ రోడ్ షో వయనాడ్ కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. రాహుల్ రోడ్ షోకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మద్దతుదారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్‌షోలో కూడా రాహుల్ మాట్లాడారు. 'వయనాడ్‌లో ప్రతి వ్యక్తి నాకు ప్రేమ, అభిమానాన్ని అందించారు. సొంత వ్యక్తిలా చూసుకున్నారు. ఈ ప్రాంతం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తుండటం గౌరవంగా భావిస్తున్నాను. మిమ్మల్ని నేను ఓటర్లుగా భావించను. నా సోదరి ప్రియాంక గురించి ఎలా ఆలోచిస్తానో మీ గురించి అంతే. అందుకే వయనాడ్‌లో నాకు సోదరీమణులు, తల్లులు, సోదరులు ఉన్నారు'అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ రాహుల్ ప్రసంగాన్ని అనువదించారు. ఏప్రిల్ 26న రెండో దశలో మొత్తం 20 పార్లమెంట్ స్థానాలకు కేరళలో ఎన్నికలు జరగనున్నాయి.

అప్పుతో స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఉద్యోగులకు దాదాపు రూ.32 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, అప్పులు తెచ్చి అస్మదీయులకు చెల్లిస్తూ ఉద్యోగులను విస్మరించిందని పేర్కొన్నారు. జగన్ సర్కార్ పరిమితికి మించి అప్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ ఎలా అనుమతి ఇస్తున్నాయని ప్రశ్నించారు. అన్ని విభాగాలను అప్పుల్లో ముంచి ఏపీని ఆర్థికంగా దివాళా తీయించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల కోడ్ తదుపరి ఇప్పటివరకు జగన్ సర్కార్ చేసిన రూ.14,500 కోట్ల చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలంతా జగన్ మాయలను గమనించి ఎన్నికల్లో ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్యాన్ని గుర్తించడంలో పొరబడ్డాం

- గాజాలో సహాయ సిబ్బందిపై దాడికి చింతిస్తున్నాం
- యుద్ధంలో ఇలాంటివి జరుగుతుంటాయ్
- ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు

టెల్‌అవీవ్: గాజాలో మానవతా సాయం అందిస్తున్న సిబ్బందిపై ఇజ్రాయిల్ దళాలు వైమానిక దాడి జరిపాయి. ఈ ఘటనను యావత్ ప్రపంచం ఆక్షేపించింది. దీంతో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వివరణ ఇచ్చుకున్నారు. లక్ష్యాన్ని గుర్తించడంలో పొరపాటు జరిగిందని, సహాయక సిబ్బందిపై దాడికి చింతిస్తున్నానని చెప్పారు. యుద్ధ క్షేత్రంలో ఇలాంటివి జరగడం సహజమేనని సమర్థించుకున్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిపిన దాడి కాదని, దీనిపై దర్యాప్తు చేపడతామని నెతన్యాహు తెలిపారు. ఇజ్రాయిల్ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ హెర్జీ హలేవీ స్పందిస్తూ క్లిష్ట పరిస్థితులలో లక్ష్యాన్ని గుర్తించడంలో జరిగిన ఘోర తప్పిదమంటూ విచారం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ దాడిలో 'వరల్డ్ సెంట్రల్ కిచెన్' (డబ్ల్యూసీకే)కు చెందిన ఆరుగురు విదేశీ సహాయకులు, భారత సంతతికి చెందిన పలస్తీనా డ్రైవర్ చనిపోయారు. సముద్ర మార్గంలో కొన్ని వేల టన్నుల ఆహారాన్ని గాజాకు చేరవేస్తోన్న ఈ సంస్థ.. తాజా పరిణామంతో తమ సహాయ కార్యకలాపాలను నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. మృతుల్లో ముగ్గురు బ్రిటన్‌వాసుల కాగా ఆస్ట్రేలియా, పోలండ్, అమెరికా, కెనడాకు చెందిన వారున్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

పౌరుల రక్షణకు చర్యలేవి: ఇజ్రాయిల్‌పై బైడెన్ ఆగ్రహం

ఇజ్రాయిల్ తీరును అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆక్షేపించారు. సామాన్యుల ప్రాణాలను రక్షించడానికి ఇజ్రాయిల్ తగిన చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. 'సహాయక సిబ్బంది వాహనాలపై వైమానిక దాడి ఎందుకు జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని ఇజ్రాయిల్ తెలిపింది. అది వేగంగా జరపాలి. దాని ఫలితాలను బహిరంగపరచాలి' అని నొక్కిచెప్పారు. యుద్ధ క్షేత్రంలో ఉండి ఆకలితో అలమటిస్తున్న వారికి ఆహారం అందించేందుకు నిస్వార్థ సేవలు చేస్తున్న సిబ్బందిపై దాడి చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని బైడెన్ అన్నారు. వారి మృతి తీరని లోటని, ఇది మొదటిసారి జరగలేదని, ఇప్పటికే ఎంతో మంది సహాయక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తంచేశారు. గాజాలో మానవతా సాయం క్లిష్టంగా మారిందన్నారు. సామాన్యులకు సేవలందిస్తున్న వారి రక్షణకు ఇజ్రాయిల్ తగిన చర్యలు తీసుకోవాలని బైడెన్ సూచించారు. పలస్తీనా పౌరులకు తమ వంతు సహాయం అందిస్తామని, అందుకున్న అన్ని మార్గాలను వినియోగిస్తామని చెప్పారు. పలస్తీనియన్లకు సాయం చేసేందుకు అవకాశం కల్పించాలని ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తెచ్చారు. కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయని, కైరోలో ఓ బృందం ఇందుకోసం పనిచేస్తోందని బైడెన్ వెల్లడించారు.

పరిస్థితులు దయనీయం: రిషి సునాక్

గాజాలో పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్ అన్నారు. తాజా ఘటనలో చనిపోయిన వారిలో బ్రిటన్ పౌరులు ఉన్నట్లు తెలిపారు. ఈ దాడిపై విచారం వ్యక్తం చేస్తూనే ఇజ్రాయిల్ తీరుపై అసహనం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై వీలైనంత వేగంగా, స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారు. లండన్‌లోని ఇజ్రాయిల్ రాయబారికి సమన్లు కూడా జారీ చేశారు. ఇదిలావుంటే ఈ ఘటనపై ఇజ్రాయిల్ వివరణ కోరినట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ కూడా వెల్లడించారు.

వణికిన తైవాన్

తైపే: తైవాన్‌లో బుధవారం ఉదయం 7.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. 25ఏళ్లల్లోనే ఇది శక్తిమంతమైన భూకంపంగా అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటలప్పుడు భూకంపం సంభవించగా దేశం అతలాకుతలమైంది. భూకంపం దాటికి భవనాలు ఊగిపోయాయి. కొన్ని నేలకూలాయి. ఆస్తి నష్టం తీవ్రంగా సంభవించింది. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. 821 మంది గాయపడ్డారు. 50 మంది ఆచూకీ లేరు. కొండచరియలు విరిగిపడిన 24 ఘటనలు చోటుచేసుకున్నాయి. 35 రోడ్డులు, వంతెనలు, సొరంగాలు దెబ్బతిన్నాయి. 127 మంది శిథిలాల కింద ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఉదయం 8 గంటల ప్రాంతంలో 7.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. దక్షిణ హౌలెన్ నగరానికి 18 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్టు తెలిపింది. భూమికి 34.8 కిమీల లోతున భూకంపం వచ్చిందని పేర్కొంది. దీంతో తూర్పు తైవాన్‌తో పాటు దక్షిణ జపాన్, చైనా, ఫిలిప్పీన్స్‌లోని కొన్ని ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీచేశారు. మియాకోజిమా సహా అనేక దీవులకు సునామీ హెచ్చరికలు జారీచేసినట్లు జపాన్ మెటీరియాలజికల్ ఏజెన్సీ వెల్లడించింది. మూడు మీటర్ల ఎత్తున రాకాసి అలలు ఎగిసిపడే ప్రమాదం ఉన్నట్లు హెచ్చరించింది. తూర్పు తీరం వెంబడి ట్రాఫిక్ స్తంభించిపోగా రైల్వే, మెట్రో సేవలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. మధ్యాహ్నానికి వీటిని పునరుద్ధరించామన్నారు. అలా కొన్ని ప్రాంతాలకు జారీ చేసిన సునామీ హెచ్చరికలనూ ఉపసంహరించుకున్నారు. అయితే తీర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, హఠాత్తుగా అలలు ఎగిసిపడి ప్రమాదం ఉందని తైవాన్ ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది. దక్షిణ పింగ్‌టుంగ్ కౌంటీ నుంచి తైపీలోని ఉత్తరం వరకూ భూమి కంపించింది. తైపే వాతావరణ సంస్థ ప్రకారం హువాలియన్ సమీపంలో 6.5 తీవ్రతతో తైపేలో భూకంపం సంభవించింది. దశాబ్దాల తర్వాత ఇంత శక్తిమంతమైన భూకంపం సంభవించిందని అధికారులు తెలిపారు. 'భూకంపం శక్తివంతంగా ఉంది. తైవాన్, దాని చుట్టుపక్కల దీవులంతటా ప్రభావం చూపింది' అని తైపే సెంట్రల్ వెదర్ అడ్మినిస్ట్రేషన్ సీస్మాలజీ సెంటర్ డైరెక్టర్ వు చియెన్-ఫు చెప్పారు. మూడు రోజుల్లో 6.5 నుంచి 7 వరకు తీవ్రతతో భూకంపాలు వస్తాయని హెచ్చరించారు. ప్రజలు సంబంధిత హెచ్చరికలు, మెసేజ్‌లపై అలసత్వం వహించొద్దని, భూకంపం కారణంగా తరలింపు కోసం సిద్ధంగా ఉండాలని సూచించారు. తైవాన్‌కు పశ్చిమంగా ఉన్న ఫిలిప్పీన్స్‌లో సునామీ హెచ్చరికలు జారీచేశారు. కాగా, 1999 తర్వాత ఇదే అత్యంత శక్తివంతమైన భూకంపమన్నారు. 1999, సెప్టెంబరులో తైవాన్‌లో 7.6 తీవ్రతతో భూకంపం సంభవించగా సుమారు 2,400 మంది చనిపోయారని గుర్తుచేశారు.

పెన్షన్ కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

గంటలకు పెన్షన్ల ప్రక్రియ ప్రారంభించడంతో పెన్షన్ దారులు అవస్థలకు గురయ్యారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం ఎర్రవారిపాలెం మండలంలో పెన్షన్ కోసం వేచి ఉన్న షేక్ అసం సాహెబ్ అనే వృద్ధుడు కళ్లు తిరిగిపడిపోవడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే ఆయన చనిపోయారు. కృష్ణా జిల్లా గంగూరులో వజ్రమ్మ అనే వృద్ధురాలు చనిపోయింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని సాయినగర్‌కు చెందిన ఈశ్వరవాక లలితమ్మ(60) మరణించింది. కృష్ణాజిల్లా సచివాలయం-3 పరిధిలో పొన్నా సుబ్బారావు అనే వృద్ధుడు పెన్షన్ కోసం వెళుతూ స్పృహ కోల్పోయాడు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విజయనగరం తదితర జిల్లాల్లోని సచివాలయాల ఎదుట వృద్ధులు పడిగాపులు కాశారు. చాలా సచివాలయాల్లో సర్వర్లు పని చేయలేదు.

బ్యాంకులకు జమకాని నిధులు

బ్యాంకులకు పూర్తి స్థాయిలో పెన్షన్ల నిధులు జమ కాలేదు. నగదు కోసం బ్యాంకులకు వెళ్లిన సచివాలయాల సిబ్బంది తిరిగి చేరుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. చాలా సచివాలయాల్లో పడిగాపులు కాశారు. అసలు నిధులు ఎప్పటికి జమ అవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. అక్కడక్కడా కొన్ని సచివాలయాల్లో మాత్రమే పెన్షన్లు పంపిణీ చేశారు. అధికారులు సమాచారం సరిగ్గా ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగానే నగదు జమ ఆలస్యమైందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షా 30 వేల సిబ్బంది పని చేస్తున్నారు. పెన్షన్ల పంపిణీకి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసినప్పటికీ, అవి వేగవంతం కావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 65,69,904 మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసేందుకుగాను రూ.1,951.69 కోట్ల మొత్తాన్ని ఆయా గ్రామ, వార్డు సచివాలయాల వారీగా బ్యాంకులలో ఈనెల 2వ తేదీ రాత్రి నిధులు జమ చేశామని ప్రభుత్వం చెబుతోంది. ఆ మొత్తం నిధులు సచివాలయాలకు జమ కాలేదని తెలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పెన్షన్లు ఇస్తున్నారన్న సమాచారంతో పెద్దఎత్తున వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తరలివెళ్లి అవస్థలకు గురయ్యారు. గ్రామ, వార్డు సచివాలయంలో పూర్తి స్థాయి సిబ్బంది ఉన్నప్పటికీ ఇంటింటా తిరిగి ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. పెన్షన్ల పంపిణీలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కాగా, పెన్షన్ల పంపిణీపై అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ పరస్పర నిందారోపణలు చేసుకున్నాయి.

హైకోర్టులో పెన్షనర్లకు చుక్కెదురు

ఇంటింటా వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన పెన్షనర్లకు చుక్కెదురైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన వి.వరలక్ష్మి, మరో ఇద్దరు పింఛన్‌దారులు పిల్ దాఖలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకునేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పెన్షన్ల పంపిణీకి రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినందున పెన్షనర్లు వేసిన పిల్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. వలంటీర్ల వ్యవస్థ లేని ఇతర రాష్ట్రాల్లోనూ పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేస్తున్నారంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది.

శ్రీనివాసులు హంతకులను కఠినంగా శిక్షించండి

ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-కడప: రాష్ట్రంలో భూ కబ్జాదారుల దౌర్జన్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, కడప జిల్లా పెండ్లిమర్రి మండలం యాదవపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులును అత్యంత కిరాతకంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు డిమాండ్ చేశారు. బుధవారం పెండ్లిమర్రి మండలంలో హత్యకు గురైన ఆదిమూలం శ్రీనివాసులు మృతదేహాన్ని, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ శ్రీనివాసులు యాదవ్‌ను హత్య చేసింది వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే అనుచరులేనన్నారు. పోలీసులు వారికి అండగా వ్యవహరిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సొంత జిల్లాతో పాటు నియోజకవర్గంలో భూ కబ్జాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులు చేయడం, కేసులు పెట్టడం, అయినా వినకపోతే అత్యంత కిరాతకంగా చంపేస్తున్నారని విమర్శించారు. కబ్జాదారులకు, వైసీపీ దౌర్జన్యాలకు బీసీ యాదవ కులానికి చెందిన యువకుడు బలి అయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. అదిమూలం శ్రీనివాసులు యాదవ్ హత్యకు భూ వివాదాలే కారణమని, ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోయినా పుల్లారెడ్డి, వారి కుటుంబ సభ్యులు, అనుచరులు గతంలో ఆదిమూలం శ్రీనివాసులు తండ్రి పేరుతో ఉన్న భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తుంటే రెవెన్యూ, పోలీసు శాఖ వారి దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి ఉపయోగంలేదన్నారు.

ప్రతి ఇంటికి మంచి చేశా

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. బుధవారం సాయంత్రం పూతలపట్టులో జరిగిన మేమంతా సిద్ధం బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రస్తుత ఎన్నికలు పెత్తందారులకు పేదలకు మధ్య జరుగుతున్నాయని చెప్పారు. వలంటీర్ల ద్వారా పౌర సేవలను ప్రతి ఇంటికి అందించామని, నేడు దురుద్దేశంతో పేదలకు ఇచ్చే పెన్షన్‌ను కూడా టీడీపీ అడ్డుకుంటోందని ఆరోపించారు. ఇది ఎంతవరకు సమంజసం అని చెప్పారు. 14ఏళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ ఒక రూపాయి అయినా పేదల ఖాతాలో జమ చేసిందా అని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రతి ఇంటికి ఏదో ఒక విధంగా లబ్ధి చేకూర్చి పేదల పక్షాన వైసీపీ ప్రభుత్వం నిలబడిందన్నారు. ప్రజలను మోసం చేయడమే అలవాటుగా పెట్టుకున్న చంద్రబాబుకు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీతో టీడీపీ జత కట్టిందని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం పేదలకు పెత్తందారుల మధ్య ఎన్నికల జరుగుతున్నాయని ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. పిల్లలు భవిష్యత్తు, పేదల సంక్షేమం ఎవరివల్ల సాధ్యమైందన్న విషయాన్ని ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఎవరివల్ల మంచి జరిగిందో... ఎవరుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ అధికారంలోకి వచ్చి నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ప్రజలకు మెరుగైన సేవలందించాలనే సంకల్పంతో గ్రామ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయటంతో పాటు పేద పిల్లలకు ఇంగ్లీష్ బోధన అందించాలని నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా మూడు వేల రూపాయల పెన్షన్ ఇస్తున్నామన్నారు. నేడు టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీలు ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాయని ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంతో ప్రతి ఇంటికి ఏదో ఒక రకంగా లబ్ధి అందించామని ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి 175కు 175 అసెంబ్లీ సీట్లు గెలిచే విధంగా ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలన్నారు. ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందుతుంటే దీన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని జగన్ ఆరోపించారు. ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో వలంటీర్ల వ్యవస్థను తీసుకొస్తే దానిపైన బురద జల్లుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు మంచి చేస్తున్న వైసీపీ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో వైసీపీ తరపున ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేసి ఓట్లు వేయాల్సిందిగా జగన్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కథ అడ్డం తిరిగింది

(మొదటిపేజీ తరువాయి)

డబ్బులు పంపిణీ చేసిన సందర్భాలు లేకపోలేదు. అయితే ఫిర్యాదులు, కేసుల నేపథ్యంలో ఎన్నికల సంఘం కఠిన నిర్ణయం తీసుకోవడంతో కథ అడ్డం తిరిగింది. వలంటీర్ల సేవలను ఎన్నికలు పూర్తి అయ్యే వరకు నిలిపివేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడం వైసీపీకి పెద్ద షాక్ ఇచ్చినట్లయింది. వలంటీర్లు ఫీల్డులో లేకపోతే ఓటర్లకు చేరువ కాలేమనే నిర్ణయానికి పార్టీ పెద్దలు వచ్చేశారు. ఈ ఐదేళ్ల కాలం వలంటీర్లకు ప్రాధాన్యతనిచ్చి... పార్టీ కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడంతో క్యాడర్ దూరమైంది. ఇప్పుడు వలంటీర్లు కూడా దూరమైతే ఎన్నికల్లో ఆమ్యామ్యాల పంపిణీలు, ఓటర్లకు నచ్చజెప్పడం, పోలింగ్ బూత్‌లకు తరలించడం, ప్రతిపక్షాల ఓటర్లను గుర్తించడం వంటి పనులు కష్టమవుతాయని వైసీపీ భావిస్తోంది. దీంతో వలంటీర్లంతా తమ పదవులకు మూకుమ్మడి రాజీనామాలు చేయాలనే కొత్త వ్యూహానికి తెరతీసింది. వైసీపీ ఐ ప్యాక్ మండల లెవల్ ఆఫీసర్ (ఎంఎల్‌ఓ)ల ద్వారా వలంటీర్లను రాజీనామాలు చేయాలని ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించారు. ఇంతకాలం ఆ ఎంఎల్‌ఓలే వలంటీర్లను గ్రూపులుగా విభజించి, వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వారికి మార్గ నిర్దేశం చేస్తూ వచ్చారు. ఇప్పుడు వారే రాజీనామాలు చేసి ఎన్నికల ప్రచారంలోకి రావాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారని కొంతమంది వలంటీర్లు తెలిపారు. ఈ దిశగా వలంటీర్ల గ్రూపులలో మెసేజ్‌లు పంపుతున్నా కూడా స్పందన లేకపోవడం వైసీపీ పెద్దల్లో గుబులు రేపుతోంది.

రాష్ట్ర వ్యాప్తంగా 2.58 లక్షల మంది వలంటీర్లు ఉండగా బుధవారం నాటికి రాజీనామా చేసిన వలంటీర్ల సంఖ్య ఎనిమిది వేలు కూడా దాటలేదు. ఇంతకాలం వలంటీర్ల ద్వారా పార్టీ పనులు చేశామని... ఇప్పుడు వారు అందుబాటులో లేకపోతే ఎలా అని తలలు పట్టుకుంటున్నారు. రాజీనామా చేసిన వలంటీర్లకు నెలకు ఐదు వేలకు బదులు పార్టీ నుంచి పది వేల రూపాయలు చెల్లిస్తామని... కొత్త మొబైల్ ఫోన్‌లు కొని ఇస్తామని హామీలు గుప్పిస్తున్నారు. కాగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా వలంటీర్లు ఉంటారని, వారిని తొలగించబోమని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు హామీ ఇవ్వడం... వలంటీర్లను అయోమయంలో పడేసింది. దీంతో అధికార పార్టీ నేతలు ఆశించిన విధంగా రాజీనామాలు చేయడం లేదు. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 1500 మంది, అనంతపురంలో 500 మంది, విశాఖ జిల్లాలో 150 మంది రాజీనామా చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఇటీవల 682 మంది ఒకేసారి రాజీనామా చేసి ఒకే రకంగా రాజీనామా పత్రాన్ని సమర్పించడంతో ఇదంతా ఐ ప్యాక్ పనేనని మరో మారు స్పష్టమైందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. రాజీనామా చేసిన వలంటీర్లపై ప్రతిపక్షాలు నిఘా పెట్టడం, వీరిని ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేయాలంటూ ఫిర్యాదులు ఇస్తుండడంతో రాజీనామాలకు వెనుకాడుతున్నారు. రాజీనామా చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు, కేసుల తప్పవేమోనన్న భయం వీరిని వెంటాడుతోంది. వలంటీర్ల వద్ద 50 ఇళ్లకు సంబంధించిన డేటా ఉన్నందున వీరు ఏ రాజకీయ పార్టీ ప్రచారంలోనూ పాల్గొనకూడదంటూ ఇప్పటికే ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో అనేకమంది రాజీనామా చేయకుండా రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని భావిస్తున్నట్లు తెలిసింది. పింఛన్ల పంపిణీ కూడా తమకు అప్పగించకపోవడంతో వలంటీర్లంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేజ్రీవాల్ అరెస్టుపై తీర్పు రిజర్వు

(మొదటిపేజీ తరువాయి)

గానీ సాక్ష్యాధారాలుగానీ లేకుండా తనను ఈడీ అరెస్టు చేసిందని ఆరోపించారు. తనను అవమానించడం... బలహీనపర్చడమే అరెస్టు వెనుక ఉద్దేశమని వాదించారు. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సంఘ్వీ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఈడీ వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, అరెస్టు చేసే సమయంలో ఆయన వాంగ్మూలాన్ని సీఎం నివాసంలో తీసుకోలేదని తెలిపారు. అరెస్టుకు ముందే ఈడీ ఈ పని చేయాల్సిందన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడమన్నది ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికల ప్రక్రియలో భాగమని చెప్పారు. కేజ్రీవాల్ వ్యవహారంలో హడావిడి చర్యలను సింఘ్వీ ప్రశ్నించారు. 'ఎందుకీ తొందరపాటు? నేను రాజకీయాలు మాట్లాడటం లేదు... చట్టం గురించి మాట్లాడుతున్నా' అని అన్నారు. ఓటింగ్‌కు ముందు ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకే కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. ఈడీ పిలుపును సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని దిల్లీ సీఎం ఆశ్రయించిన తర్వాత దర్యాప్తు సంస్థ వరుస పెట్టి ఆయనకు సమన్లు జారీ చేయడాన్ని సింఘ్వీ ప్రశ్నించారు. కేజ్రీవాల్ పారిపోయేందుకు అవకాశం ఉందా? ఏడాదిన్నర కాలంలో సాక్ష్యులను ప్రభావితం చేసేందుకు ఆయన యత్నించారా? విచారణను నిరాకరించారా? అంటూ ఈడీ వైఖరిని ఉద్దేశిస్తూ వరుస ప్రశ్నలు సంధించారు. ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు వాదిస్తూ 'నేరస్తులను అరెస్టు చేసి జైల్లో పెడతారు. మేము నేరం చేస్తాం కానీ ఎన్నికలు ఉన్నాయి కాబట్టి అరెస్టు చేయకూడదనే హక్కు విచారణ ఖైదీలకు ఉండదు' అని నొక్కిచెప్పారు. 'రాజకీయ నాయకుడు ఎన్నికలకు ముందు హత్య చేశాడే అనుకోండి అతనిని అరెస్టు చేయరా? అతని అరెస్టుతో ఎన్నికలకు హామీ కలుగుతుందా? హత్య చేసిన వారు... నన్ను అరెస్టు చేయడానికి కుదరదని ఎలా అంటారు? అని రాజు వాదించారు. అప్రూవర్‌లుగా మారిన నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగానే గతంలో మనీశ్ సిసోడియా ప్రస్తుతం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసినట్లు కోర్టుకు తెలిపారు. వాదనల అనంతరం తీర్పును గురువారం మధ్యాహ్నం వరకు రిజర్వులో ఉంచుతూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

విజయవాడ రైల్వే డివిజన్‌కు రికార్డు స్థాయి ఆదాయం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): విజయవాడ రైల్వే డివిజన్ చరిత్రలో ఇప్పటి వరకు ఎప్పుడూ లేనంతగా రికార్డు స్థాయి ఆదాయం ఆర్జించిందని డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ తెలిపారు. డివిజనల్ వార్షిక వివరాలను ప్రకటిస్తూ గత రికార్డులను తిరగరాస్తూ 202-24 ఆర్థిక సంవత్సరంలో రూ.5,311.8 కోట్ల ఆదాయంతో 5.69 శాతం వృద్ధి చెందిందన్నారు. ప్రయాణికులు, సరకు రవాణా టికెట్ తనిఖీల ద్వారా ఈ ఆదాయం లభించింది. ప్రయాణికుల ద్వారా రూ.1,379.3 కోట్లు వచ్చింది. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 10.63 శాతం పెరిగిందన్నారు. అలాగే 36.63 మిలియన్ టన్నుల సరకు రవాణా ద్వారా రూ.4,057.01 కోట్లు సమకూరాయి. ముఖ్యంగా అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా రూ.2,190,16 కోట్లు, కాకినాడ పోర్టు ద్వారా 906.2 కోట్లు ఆదాయం వచ్చి డివిజన్ చరిత్రలో తొలిసారిగా రూ.4 వేల కోట్ల మార్కును అధిగమించినట్లు అయ్యిందన్నారు. టికెట్ తనిఖీ ద్వారా రూ.61.55 కోట్లు లభించాయన్నారు. ప్రయాణికుల మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా డివిజన్ పరిధిలోని నెల్లూరు, రాజమండ్రి రైల్వేస్టేషన్లను పూర్తి స్థాయిలో ఆధునికీకరించారు. 12 లెవల్ క్రాసింగ్ గేట్ల స్థానంలో ఆర్‌యూబీ, ఆర్వోబీలను నిర్మించారు. డివిజన్‌లోని ముఖ్య రైల్వేస్టేషన్ల వద్ద రూ.150 కోట్ల వ్యయంతో గూడ్‌షెడ్లను నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే డివిజన్ సరకు రవాణా ఆదాయం మరింత పెరగ నుంది. విజయవాడ రైల్వే స్టేషన్‌తో పాటు డివిజన్ వ్యాప్తంగా ముఖ్య రైల్వేస్టేషన్లలో

డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్

ఎస్కలేటర్లు, లిఫ్టులు ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ, రాజమహేంద్ర వరంలో రాపిడో బైక్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఒంగోలు, కాకినాడలో త్వరలోనే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే విజయవాడ రైల్వేస్టేషన్లో మైక్రో స్టే ఏసీ రూమ్స్ సౌకర్యం అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్ పరిధిలో మొత్తం 84.96 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్లు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ బైపాస్ లేన్‌లో భాగంగా విజయవాడ నార్త్ ఈస్ట్ క్యాబిన్, గుణదల మధ్య 5.99 కి.మీ కొత్త లైన్ ప్రారంభించామన్నారు. మూడో రైల్వే లైనులో భాగంగా బాపట్ల-టి.చుండూరు, సూరావొడ్డిపాలెం-టి.చుండూరు మధ్య నిర్ణీత వ్యవధిలోనే పనులను విజయవంతంగా పూర్తి చేశారు. మొత్తం 288 కి.మీ మేర విద్యుదీకరణ పూర్తయింది. కోటిపల్లి-కాకినాడ మధ్య ఒక చిన్న స్ట్రెచ్ మినహా డివిజన్ వ్యాప్తంగా అన్ని లైన్లు 100 శాతం విద్యుదీకరణ పూర్తయ్యాయి. రైళ్లు, స్టేషన్‌లు, పార్శిల్ ఆఫీసులు, గూడ్స్ షెడ్‌లలో ఆర్పీఎఫ్/కమర్షియల్ సిబ్బందితో కలిసి అగ్ని నివారణ తనిఖీలు క్రమం తప్పకుండా తనిఖీలు చేయటం, రైళ్లలో పార్శిల్స్‌ను లోడ్ చేయడం/అన్‌లోడ్ చేసే సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా హమాలీలకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. మానవరహిత లెవెల్ క్రాసింగ్‌లను దాటుతున్నప్పుడు భద్రతా అలవాట్లను పెంపొందించడానికి, రైళ్లలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా ఎల్‌సి గేట్‌ల దగ్గర భద్రతా ప్రజా అవగాహన ప్రచారాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 255 మంది పారిపోయిన పిల్లలను చైల్డ్‌లైన్ ద్వారా రక్షించి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించామని ఆయన వివరించారు. 296.785 కిలోల గంజాయిని ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుందన్నారు. 24 మంది నేరస్తుల నుంచి రూ.23,76,000 విలువైన గంజాయిని పట్టుకున్నారు. ఆర్‌పీఎఫ్ ద్వారా 60 మంది టౌట్‌లు అరెస్టు చేయటం, 385 మంది ఖాతాలు బ్లాక్ చేశామన్నారు. ప్రయాణికుల వస్తువులను దొంగతనం చేసిన 100ని పట్టుకుని వారి నుంచి రూ.1.11 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. విద్యుత్తును పొదుపుగా వాడడంతో విజయవాడ రైల్వే ఆస్పత్రితో పాటు ఈటీసీసీకి జీఎం అవార్డులు లభించాయి. అలాగే డివిజన్‌లోని గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, గుడివాడ, భీమవరం, నరసాపురం, కాకినాడ టౌన్ స్టేషన్లకు ఐఎస్వో సర్టిఫికేషన్ లభించింది. ఏపీ రాష్ట్ర వార్షిక టూరిజం ఎక్సలెన్స్ అవార్డులలో విజయవాడ రైల్వే స్టేషన్‌కు 'ఉత్తమ పర్యాటక స్నేహపూర్వక స్టేషన్ అవార్డు' లభించింది. రెండు రైల్ కోచ్ రెస్టారెంట్లు వరుసగా రాజమండ్రి, విజయవాడ రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని అభినందించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో డివిజన్ ఆదాయం మరింత పెరిగేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

తప్పుడు విధానాల వల్లే పెన్షన్‌దారులకు అవస్థలు

దేవినేని ఉమా విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వ తప్పుడు విధానాల వల్లే పెన్షన్ దారులు అవస్థలకు గురవుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. వృద్ధులన్న జాలి కూడా లేకుండా అనే తేడా లేకుండా పింఛన్ల కోసం సచివాలయాలకు రావాలని చెప్పడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వానికి లబ్ధి చేయాలనే కుట్రతో సీఎస్ జవహర్ రెడ్డి, సెర్ఫ్ సీఈఓ మురళీధర్ రెడ్డి, సీఎం పేషీ ముఖ్య కార్యదర్శి ధనుంజయ రెడ్డి ఈ దారుణానికి పాల్పడ్డారని ఆరోపించారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే కొంతమంది అధికారులు పెన్షన్ దారులను మండుటెండల్లో నిలబెట్టే ఆలోచన చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో కొద్దిపాటి విలేజ్ సెక్రటరీలు ఉన్నప్పుడే అందరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకున్నామని, ఇప్పుడున్న వేలమంది సచివాలయ సిబ్బందితో పింఛన్లు ఇంటివద్ద అందించడం సాధ్యమేనని జిల్లా కలెక్టర్లు చెప్పినా కూడా సెర్ఫ్ సీఈఓ మురళీధర్ రెడ్డి, ధనుంజయ రెడ్డి పక్కదోవ పట్టించారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం కోసం ఇటువంటి కుట్రలకు వైసీపీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వం పన్నిన కుట్రలో పాలుపంచుకున్నందుకు 9 మంది అధికారులు బలయ్యారని చెప్పారు. 3వ తేదీ వచ్చినా సచివాలయ సిబ్బంది చేతికి డబ్బులు అందలేదంటే ఈ ప్రభుత్వం ఎంత కుట్రపూరితంగా వ్యవహరిస్తోందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

పెన్షన్ ఇవ్వకపోవడం ప్రభుత్వ అసమర్థతే: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సచివాలయాలకు వచ్చిన వృద్ధులను పెన్షన్ ఇవ్వలేని ప్రభుత్వ అసమర్థతను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... తిరుపతి జిల్లా ఎర్రవారి పాలెంలోని నెరబైలు సచివాలయం వద్ద షేక్ అసమ్ నన్నే సాహెబ్ అనే వృద్ధుడు మరణించడంనై విచారం వ్యక్తంచేశారు. ఆ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 3వ తేదీ వచ్చినప్పటికీ పెన్షన్ పంపిణీ చేయకుండా వృద్ధులు, వికలాంగులు, మహిళల్ని ఎండలో శిక్షించడం భావ్యం కాదన్నారు. తక్షణం పెన్షన్లు పంపిణీ చేయాలన్నారు. ఎండ తీవ్రత రీత్యా సచివాలయాల దగ్గర షామియానాలు ఏర్పాటు చేయాలని, సచివాలయాలకు రాలేనివారికి ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ అందించాలని సీపీఎం డిమాండ్ చేసింది. పెన్షన్‌దారుల కష్టాలకు వైసీపీ, టీడీపీ పార్టీలే బాధ్యత వహించాలని, వారి రాజకీయ సమరంలో వృద్ధులు, మహిళలు, వికలాంగులు సమిధలవుతున్నారని పేర్కొన్నారు. వారికి రక్షణగా సీపీఎం కార్యకర్తలు నిలబడి అందరికీ పెన్షన్ ఇంటివద్దే సకాలంలో అందేలా ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు.

పెన్షన్ల పేరుతో చంద్రబాబు నాటకాలు

మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబుకు పేదలపై ఇప్పుడు కపట ప్రేమ గుర్తుకొచ్చిందా?, పెన్షన్ల పేరుతో ఆయన నాటకాలాడుతున్నారని మచిలీపట్నం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. 60 లక్షల మంది పేదలు, రోగుల పెన్షన్లను అడ్డుకున్న సైకో ఎవరని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు ఏనాడూ సచివాలయం గుమ్మం తొక్కలేదని, ఒకటో తేదీన ఠంచన్‌గా పెన్షన్లు ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పెన్షన్లు ఆపాలన్న దౌర్భాగ్యపు ఆలోచన ఎవరికి వచ్చిందనీ, ముసలివారి ఉసురు మీకు తగలదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 58 నెలలు ఇంటికెళ్లి పెన్షన్లు అందించామని, ఈ రెండు నెలల పెన్షన్లు ఆపినంత మాత్రాన లబ్ధిదారులకు జగన్‌పై ప్రేమ తగ్గిపోతుందా? అని మండిపడ్డారు. వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు విషం కక్కారని, వలంటీర్ల వ్యవస్థ దుర్మార్గమైనది అయితే ప్రజలే మమ్మల్ని ఓడిస్తారు కదా? అని సూటిగా ప్రశ్నించారు. నిన్నటివరకు జగన్ ప్రభుత్వం ఒక్క ప్రభుత్వ ఉద్యోగమూ ఇవ్వలేదని చంద్రబాబు ఆరోపించారని, నేడు లక్షా 60 వేల మంది గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగులున్నారని చెబుతున్నారని, మరి ఈ సచివాలయాల ఉద్యోగులు ఎక్కడ నుంచి వచ్చారని నిలదీశారు. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్న పాపపు నోళ్లతోనే లక్షా 60 వేల ఉద్యోగాలిచ్చినట్లు చెప్పాల్సి వచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో 2 లక్షల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించామని వివరించారు. యువతకు లంచాలు లేకుండా ఉద్యోగాలు లభించాయని స్పష్టం చేశారు. చంద్రబాబు సిగ్గు లేకుండా జగన్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పరిపాలన చూసి ఓటేస్తారా?, లేక చివరి రెండు నెలల పెన్షన్లు ఎవరిచ్చారో చూసి ఓటేస్తారా? అని నిలదీశారు. నాడు పసుపు కుంకు, రైతు నేస్తం అంటూ చంద్రబాబు ఎన్నికల్లో ఎరవేసినా ప్రజలు నమ్మలేదని గుర్తు చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం

ఇండియా కూటమిని గెలిపించండి

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-కాకినాడ: దేశంలో మతోన్మాద బీజేపీ చర్యల వల్ల రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలుగుతున్నందున మతతత్వ పార్టీలను ఓడించి రాజ్యాంగ రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర సమితి అధ్వర్యంలో రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న ఎన్నికల పాటల వర్క్ షాప్‌కు బుధవారం రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్‌తో జతకట్టి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అందించిన అత్యంత విలువలతో కూడిన రాజ్యాంగాన్ని నిలువునా తుంగలో తొక్కడం ద్వారా మనువాదాన్ని ముందుకు తీసుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. మోదీ అతని అనుచరులైన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బీజేపీకి వత్తాసు పలుకుతూ రాష్ట్రాన్ని దివాలా దిశగా తీసుకెళ్లాలని ప్రయత్నం చేస్తున్నారని, ఆ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ, అలాగే 'ఇండియా' కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి ఈ ఎన్నికల్లో ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. ఆటపాటలతో, కొత్త కళారూపాలతో ప్రజలను మరింత చైతన్యవంతులను చేసి ఓట్లను రాబట్టాలని ఆయన సూచించారు. ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ పార్టీని, ప్రజాసంఘాలను ప్రజా చైతన్యం వైపు మరల్చడానికి ప్రజానాట్యమండలి ఎంతగానో దోహదపడుతోందన్నారు. రాష్ట్రమంతా విస్తృతంగా ప్రచార కార్యక్రమంలో ముందుండడానికి ప్రయత్నం చేస్తున్నందుకు కళాకారులందరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సాంస్కృతిక పోరాటాలు కూడా నిత్యం కొనసాగాలని, లేకుంటే ప్రజా సంస్కృతి పూర్తిగా దెబ్బతిని సమాజ మనుగడకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి రామచంద్రాపురంలో ఎన్నికల పాటల శిక్షణా శిబిరం ఏర్పాటు చేయడం తమకు ఆనందం కలిగించిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణా తరగతులు నిరంతరం జరుపుకోవాలని, అందుకు అవసరమైన సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి గని, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్ర నాయక్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రాము, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉమ్మడి గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మహంత లక్ష్మణరావు, వి.నాగరాజు, శివయ్య, నజీర్, కుమార్, శామ్యూల్, ప్రేమానందం, అనంతలక్ష్మి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాలను ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల బుధవారం విడుదల చేశారు. తాడేపల్లిలోని సంస్థ ప్రధాన కార్యాల యంలో ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా 40,853 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని, పరీక్షకు 35,629 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురకులాల్లో బాలికలకు 9,280 సీట్లు, బాలురకు 4,280 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతిభ ఆధారంగా ఆయా కేటగిరీల్లో విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తామని చెప్పారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాల కోసం అభ్యర్థులు http.//apbragcet.apcfss.in నందు పొందగలరని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నత ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

6న 'గడప గడపకు' ఆవిష్కరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు: వల్లూరు శివప్రసాద్ కథా సంపుటి 'గడపగడపకు'(హాస్య, వ్యంగ్య కథలు) ఆవిష్కరణ సభ ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని డిస్ట్రిక్ట్ సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అరసం(ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం) గుంటూరు జిల్లా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షతన జరిగే సభలో రచయిత, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్ విశ్రాంత ఎడిషినల్ కమిషనర్ బి.రవీంద్రనాథ్ కథా సంపుటిని ఆవిష్కరించను న్నారు. రచయిత, కొటక్ మహేంద్ర బ్యాంక్ విశ్రాంత అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పీ వీరారెడ్డి తొలిప్రతి స్వీకరిస్తారు. ప్రముఖ విమర్శకురాలు డాక్టర్ సీహెచ్ సుశీల పుస్తక పరిచయం చేయనున్నారు.

పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-దుగ్గిరాల: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సంఘ రాష్ట్ర కార్యదర్శి కాబోతు ఈశ్వరరావుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఉపాధి కూలీల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 70ఏళ్లుగా కమ్యూనిస్టు పార్టీలు పోరాడి యూపీఏ ప్రభుత్వం ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడం జరిగిందని గుర్తుచేశారు. గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు పనులు లేక వలసలు వెళుతున్నారని, ఈ విషయాన్ని గమనించి ఏ గ్రామంలో కార్మికులకు అదే గ్రామంలో పనులు కల్పించాలని కోరడం జరిగిందన్నారు. తద్వారా వలసలు నివారించడంతో పాటు వ్యవసాయ కార్మికులు ఆర్థికాభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. పని ప్రదేశంలో కార్మికులకు మౌలిక వసతులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తక్షణమే ఫస్ట్ ఎయిడ్ కిట్లు, తాగునీరు, ఎండలో సేద తీరడానికి వసతులు, పనిముట్లు, సమ్మర్ అలవెన్స్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కేంద్ర బడ్జెట్ రూ.2.45 లక్షల కోట్లు కేటాయించడం ద్వారా దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలందరికీ సరిపడా పనిదినాలు ఇవ్వవచ్చని, తద్వారా లక్ష్యం పూర్తవుతుందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలకు తగినన్ని నిధులు కేటాయించి... వారికి పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ కార్మికుల చట్టాల అమలును పాలక ప్రభుత్వాలు చిన్నచూపు చూడటం తగదని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ... వారి చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, హక్కులను కాపాడుకోవడానికి కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పంతగాని మరియదాసు, మేట్‌లు తిరుపతమ్మ, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, శ్రీనివాసరావు, సాంబశివరావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మల్లేశ్వరి, మరియమ్మ, శాంతమ్మ, మేరీ, స్వప్న, ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కాంగ్రెస్ ప్రచారం

బద్వేల్ నుంచి షర్మిల బస్సుయాత్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఈనెల 5వ తేదీ నుంచి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం ప్రారంభించనుంది. కడపజిల్లా బద్వేల్ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. బద్వేల్ నియోజకవర్గం కాసినాయన మండలం ఆమగంపల్లి నుంచి ఉదయం 9.45 గంటలకు బస్సు యాత్రను షర్మిల ప్రారంభిస్తారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాలో 114 అసెంబ్లీ, 5 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన సంగతి విదితమే. మంగళవారం ఇడుపులపాయలో వైఎస్ఆర్ ఘాట్ వద్ద షర్మిలతో పాటు కాంగ్రెస్ నేతలు నివాలులర్పించారు. అనంతరం అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మిగిలిన స్థానాల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాపైనా కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్ని జిల్లాల్లోనూ ఆమె సుడిగాలి పర్యటనలు చేశారు. కాంగ్రెస్ బలోపేతం కోసం వివిధ పార్టీల నుంచి షర్మిల అధ్వర్యంలో చేరికలు జరిగాయి. కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాలకు కమిటీలను వేసి పార్టీలో ఉత్తేజం నింపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సహా విభజన హామీల అమలు కేంద్రంలో ఏర్పాటు కాబోయే ఇండియా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని షర్మిల నొక్కిచెబుతున్నారు. పదేళ్ల ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరిగిందని... టీడీపీ, జనసేన, వైసీపీలు బీజేపీకి బీటీమ్‌గా మారాయంటూ షర్మిల తనదైన శైలిలో విమర్శలు చేశారు. రాబోయే ఎన్నికల్లో పోటీకి అన్ని విధాలా కాంగ్రెస్ సిద్ధమైంది. తాజాగా షర్మిల చేపట్టనున్న బస్సు యాత్రలో ఆమెతో పాటు కాంగ్రెస్ ముఖ్యనేతలు పాల్గొంటారు. పార్టీ అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ షర్మిల ప్రచారం నిర్వహిస్తారు.

'పాలిసెట్' శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులందరికీ ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశాల పెంపు లక్ష్యంగా విద్యార్థులకు ఇస్తున్న సమగ్ర శిక్షణకు మంచి స్పందన లభిస్తోందన్నారు. బుధవారం విజయవాడ, గుంటూరులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ తో సహా వివిధ శిక్షణ కేంద్రాలను నాగరాణి సందర్శించి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలను కోరుకునే ప్రతి ఒక్కరికీ వయోభేదం లేకుండా శిక్షణ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ, 182 ప్రైవేటు పాలిటెక్నిక్కుల్లో ఏప్రిల్ 24 వరకు తరగతులు నిర్వహించి ఏప్రిల్ 25వ తేదీన గ్రాండ్ ఫ్రీ ఫైనల్ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లోనూ స్టడీ మెటీరియల్ సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో ఈ శిక్షణకు మంచి డిమాండ్ ఉందని.... విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు ఎనిమిదవ తేదీ నుండి మరో బ్యాచ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. పాలిసెట్ కోచింగ్ స్టడీ మెటీరియల్‌ను ప్రతి ఒక్క విద్యార్థికి అందిస్తామని, రెండు గంటల పాటు గణితం, ఒక గంట భౌతిక శాస్త్రం, మరో గంట రసాయన శాస్త్రం బోధిస్తారన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షా ఏప్రిల్ 27వ తేదీన జరగనుండగా... ఆన్‌లైన్ అప్లికేషన్‌లకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొని, పాలిటెక్నిక్ చదివిన తర్వాత లభించే ఉపాధి అవకాశాలపై కమిషనర్ తో వ్యక్తిగతంగా మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు, సంయుక్త కార్యదర్శి జానకిరామ్, ఉప కార్యదర్శి రవికుమార్, కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు గురునాథం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మూడు రాజధానుల ఉద్యమ నాయకుడు, బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు మాదిగాని గురునాథం టీడీపీలో చేరారు. బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నాలుగేళ్ల నుంచి మందడం సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద మూడు రాజధానుల ఉద్యమంపై ఆయనతో పాటు బహుజన పరిరక్షణ సమితి నేతలు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో విజయవాడ లోక్‌సభ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని అధ్వర్యంలో లోకేశ్‌ను కలిసి గురునాథంతో పాటు ఎన్టీఆర్ జిల్లా డాక్టర్ సెల్ మాజీ అధ్యక్షుడు సంకే విశ్వనాథ్, యునైటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు అప్పికట్ల జవహర్ తదితరులు పార్టీలో చేరారు. అనంతరం మాదిగాని గురునాథం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా చట్ట విరుద్ధంగా ప్రయత్నిస్తూ, తమను నమ్మించేందుకు ప్రయత్నించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బహుజనులను ఏకంచేసి తెలుగుదేశం కూటమి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. అభివృద్ధి, వికేంద్రీకరణ టీడీపీ కూటమితోనే సాధ్యమవుతుందని చెప్పారు.

సుగుణమ్మ మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

ఏఐటీయూసీ సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ: ఉమ్మడి కర్నూలు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేత సుగుణమ్మ బుధవారం మరణించారు. సుగుణమ్మ మృతిపై ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఓబులేసు మాట్లాడుతూ సుగుణమ్మ మరణం ఏఐటీయూసీకి, డోన్ పట్టణ భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటన్నారు. ఆమె అంగన్‌వాడీ కార్మిక ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ ఎనలేని సేవలు అందించారని, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలిగా మంచి గుర్తింపు సాధించారని కొనియాడారు. ఇటీవల జరిగిన 42 రోజుల అంగన్‌వాడీ సమ్మె ప్రారంభంలో సుగుణమ్మ పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆ తరువాత అనారోగ్యానికి గురై బాధపడ్డారని చెప్పారు. రెండు మాసాల నుండి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మరణించడం అత్యంత బాధాకరం అన్నారు. ఆమె లేని లోటు అటు అంగన్‌వాడీల ఉద్యమానికి, ఇటు ఏఐటీయూసీకి తీరని నష్టమని పేర్కొన్నారు.

NOVA AGRITECH LIMITED — Nova Agritech Limited

In Pursuance to the order No 2900(E) dated 24th October 2015. Issued by Department of Agriculture, Co-operation and Farmers Welfare, Ministry of Agriculture, Govt. of India. **Nova Agritech Limited** hereby notifies that it intends to introduce and sell commercially its new 100 percent Water soluble mixtures of fertilizers as per the specifications given below:

LIST OF THE PRODUCTS

S.No.	NAME OF THE FERTILIZERS	BRAND NAME
01	10:40:20+TE	Nova Nutri Root Rich
02	10:20:40+TE	Nova Nutri Fruit More
03	10:00:40+TE	Nova Nutri Cal Bore
04	03:00:40+TE	Nova Nutri K-41
05	24.24.18	Nova Nutri Balance
06	00:24:15+TE	Nova Nutri Supreme, Clean & Green
07	13.40.13	Nova Nutri Bond, Nova Nutri Flow NPK 13-40-13
08	15:05:30+TE	Nova Nutri Rich Mag
09	00.37.37	Nova Nutri Sus10
10	30.10.10	Nova Nutri N Force
11	10:54:10+TE	Nova Nutri PHOS54
12	05:15:45+TE	Nova Nutri K-Amino
13	00.00.50	Nova Fert 00:00:50
14	19.19.19	Nova Fert 19:19:19
15	12:61:00	Nova Fert 12:61:00
16	13:00:45	Nova Fert 13:00:45
17	00:52:34	Nova Fert 00:52:34
18	17:44:00	Nova Fert 17:44:00
19	00:40:20+TE	Kin- Nova
20	00:20:40+TE	Nova Nutri K- Phos
21	21:21:21+TE	Nova Nutri Super Sol
22	12:12:36+TE	Nova Nutri Power Sol
23	15:45:10+TE	Nova Nutri Phos Gem
24	10:15:10+TE	Nova Nutri Fulfill
25	03:20:40+TE	Nova Nutri F2
26	18:46:00+TE	Nova Nutri DAP
27	12:11:18+TE	Nova Nutri Mela N
28	18:00:07+TE	Nova Nutri Smile
29	00:43:30+TE	Nova Sanjeevani, Yodha
30	15:05:10+TE	Nova Googley
31	01:00:30+TE	Nova K Mag, Nova Poly-K
32	10.08.34	Nova Nuton
33	10.05.36	Nova Nutri Pulse
34	15:25:10+TE	Nova Nutri Cane-1
35	15:25:10+0.1B+8S	Nova Nutri Cane 2
36	17.14.09	Nova Nutrimato-1, Nova Tomaton-1
37	13.12.19	Nova Nutrimato-2, Nova Tomaton-2
38	09:08:28+TE	Nova Nutrimato-3, Nova Tomaton-3
39	11.36.24	Nova Nutri Startup, Nova Nutri Start
40	08:24:24+4MgO+6S	Nova Nutri Bloom
41	16.11.32	Nova Nutri Horti-1
42	13:05:37+3CaO	Nova Nutri Horti-2
43	12:06:22+12CaO	Nova Nutri Horti-3
44	21:12:16+2S	Nova Nutri Sol-1 (SOLANACEAE)
45	14:05:32+2S	Nova Nutri Sol-2 (SOLANACEAE)
46	16.08.32	Nova Nutri Lakshya
47	00.09.46	Nova Potash Pro
48	09:27:18+3MgO+3S	Nova Nutri Complete
49	00:60:20	Nova Nutri Phos
50	00:44:44	Nova 4 Star, Nova 4 Square
51	15.15.30	Nova Nutri Fruit Set
52	10.06.35	Nova Nutri Star Potash
53	15.25.10	Nova Nutri Vegetable Star
54	05.55.17	Nova Nutri 555 + K
55	14.00.48	Nova Nutri 14:0:48
56	24.24.00	Nova Fert 2424
57	28.28.00	Nova Fert 2828
58	11:44:11+TE	Nova Nutri 1144
59	00.40.40	Nova Fert 0: 40: 40
60	00:00:22+18MgO+20S	Nova Nutri KaliMag
61	09.19.19	Nova Fert 09: 19: 19
62	00:00:50+17.5S	Nova Nutri KaS
63	09:27:18+7.5S+TE	Nova Floron
64	20.16.17	Nova Nutri Banana 1
65	11.18.23	Nova Nutri Banana 2
66	12.00.38	Nova Nutri Banana 3
67	27.14.08	Nova Nutri Chilli 1
68	20.17.17	Nova Nutri Chilli 2
69	15.15.13	Nova Nutri Chilli 3
70	10.05.31	Nova Nutri Chilli 4
71	17.00.32	Nova Nutri Chilli 5
72	08.20.16	Nova Nutri Citrus 1
73	22.05.18	Nova Nutri Citrus 2
74	05.05.30	Nova Nutri Citrus 3
75	08.21.21	Nova Nutri Pomegranate 1
76	06.45.06	Nova Nutri Pomegranate 2
77	08.08.38	Nova Nutri Pomegranate 3

In all the grades mentioned above. (a) Moisture is Maximum 0.5 per cent (by weight); (b) Total Chloride is less than 0.5 per cent (by weight); (c) Matter insoluble in water is less than 0.5 per cent (by weight); (d) Lead is less than 0.003 per cent (by weight); (e) Cadmium is less than 0.0025 per cent (by weight); (f) Arsenic is less than 0.01 per cent (by weight).

Regd. & Corporate Office
Nova Agritech Limited
Sy.No. 251/A/1, Singannaguda (V), Mulugu (M), Siddipet (Dist.)-502279, Telangana.
Ph : +91-8454-253446, E-mail : info@novaagri.in, ipo@novaagri.in
Visit us at : **www.novaagri.in**

సంపాదకీయం

కాలి బూడిదైన ఇ.డి. దూది మేడలు

కేవలం 24 గంటల సమయంలో మోదీ ప్రభుత్వం సుప్రీం కోర్టు నుంచి మూడు ఛీత్కారాలు ఎదుర్కోవలసి వచ్చింది. మొదటిది: ఢిల్లీ మద్యం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది. రెండవది: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు అనుబంధంగా ఉండే వీవీపాట్ పత్రాలన్నింటినీ లెక్కించే అంశాన్ని పరిశీలించాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. మూడవది: పతంజలి ఆయుర్వేదిక్ యజమాని బాబా రాం దేవ్, ఆయన సహచరుడు ఆచార్య బాలకృష్ణ చేతులు జోడించి క్షమించండి అని అనేక సార్లు వేడుకున్నా వారి క్షమాపణను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అంతకు ముందు ఎన్నికల బాండ్లను రద్దుచేస్తూ ఇవి రాజ్యాంగ విరుద్ధమైనవని సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ఢిల్లీ మద్యం కేసు అనేక మలుపులు తిరుగుతోంది. ఈ విధానాన్ని కేజ్రీవాల్ నాయకత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ అది ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులను వెంటాడుతూనే ఉంది. సంజయ్ సింగ్ విషయంలో అయితే ఎన్‌ఫోర్స్ మెంట్ డైరాక్టోరేట్ (ఇ.డి.) అడ్డంగా దొరికి పోయింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంజయ్ ఖన్నా నాయకత్వంలోని దీపంకర్ దత్తా, పీబీ వరాలేతో కూడిన బెంచ్ అడిగిన ప్రశ్నలకు ఇ.డి. దగ్గర సమాధానమే కనిపించలేదు. ఆరు నెలలుగా సంజయ్ సింగ్‌ను జైలులో ఉంచినప్పటికీ ఆయన విషయంలో ఇ.డి. తమ వాదనను నిలబెట్టుకోవడానికి అనువైన సమాచారం ఏమీ సేకరించలేక పోయింది. పోనీ విచారణ అయినా మొదలైందా అంటే అదీ లేదు. మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అవినీతికి పాల్పడ్డారని నిరూపించడానికి ఇ.డి. దగ్గర రుజువులే కనిపించడం లేదు. కేవలం ఇదే కేసులో నిందితుడిగా ఉన్న దినేశ్ అరోరా అప్రూవర్‌గా మారిన తరవాత ఇచ్చిన వాగ్మూలం ఆధారంగానే సంజయ్ సింగ్‌ను అరెస్టు చేశారు. దినేశ్ అరోరా మొత్తం పదిసార్లు వాంగ్మూలం ఇస్తే తొమ్మిది సార్లు సంజయ్ సింగ్ పేరే ప్రస్తావించలేదు. అప్రూవర్‌గా మారిన తరవాత పదోసారి ఇచ్చిన వాంగ్మూలంలో మాత్రమే ఆయన సంజయ్ సింగ్ పేరు ప్రస్తావించారు. ఇలాంటి దశలో తొమ్మిది సార్లు సంజయ్ సింగ్ పేరెత్తకుండా పదో సారి ఇచ్చిన వాంగ్మూలంలో సంజయ్ సింగ్ పేరు ప్రస్తావించారన్న కారణంతో ఎలా అరెస్టు చేస్తారని సుప్రీంకోర్టు నిలదీసింది. న్యాయమూర్తులు ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే ఇ.డీ. తరఫున వాదిస్తున్న అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు నోట మాటే పెకలలేదు. ద్రవ్య అక్రమ చెలామణి చట్టంలోని 45 వ సెక్షన్ ప్రకారం సంజయ్ సింగ్ తప్పు చేసిన దాఖలాలే కనిపించడం లేదు కదా, ఆ మాట మేమిచ్చే ఉత్తర్వులో రాయవలసి వస్తుందని సంజీవ్ ఖన్నా గట్టిగా అడిగిన తరవాత అడిషనల్ సొలిసిటర్ జనరల్ బెయిలు ఇవ్వడాన్ని నిరోధించలేక పోయారు. అయితే సంజయ్ సింగ్‌కు బెయిలు మంజూరు చేయడాన్ని పూర్వోదంతంగా స్వీకరించ డానికి వీలు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంటే ఇదే వ్యవహారంలో 13 నెలల నుంచి జైలులో ఉన్న మనీశ్ సిసోడియా, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఇలాగే బెయిలు మంజూరు అవుతుందని సంబర పడిపోవడానికి అవకాశం లేదు. మద్యం కేసులో డబ్బు ఇచ్చిన వారెవరు, తీసుకున్న వారెవరో చెప్పే పరిస్థితిలో ఇ.డి. లేదు. మద్యం వ్యవహారంలో డబ్బులు చేతులు మారిందని, ఈ మొత్తం వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కీలక వ్యక్తి అని ఆరోపించిన ఇ.డి. దిక్కు తోచని స్థితిలో పడిపోయింది. మద్యం కేసులో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని ఆరోపించినప్పుడు ఆ డబ్బు జాడ కనిపెట్టడంలో ఇ.డి. విఫలమైంది. ఎంత సేపూ గోవా ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ రూ.40 కోట్లు ఖర్చు చేసిందని మాత్రమే ఇ.డి. పాడిన పాటే పాడుతోంది.

ఈ కేసులో మూడు అంశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. కిరాతకమైన చట్టాల కింద అరెస్టు అయిన వారికి బెయిలు మంజూరు చేయడంలో న్యాయస్థానాలు మొదట కొద్దిగా సంకోచించవచ్చు. అరెస్టు చేసిన వ్యవస్థలు తప్పు చేసి ఉండకపోవచ్చుననీ భావించవచ్చు. అయితే అరెస్టు చేసిన వ్యవస్థలు సరైన రుజువులు చూపకపోతే న్యాయమూర్తులు గుచ్చి ప్రశ్నలడిగి నిందితులకు బెయిలు మంజూరు చేయడానికి ముందుకు రావచ్చు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత ఉన్న వ్యవస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిందే. కానీ లోటంతా ఆ నిష్పాక్షికతదే. సంజయ్ సింగ్‌కు బెయిల్‌ను పూర్వోదంతంగా పరిగణించకూడదని సుప్రీం కోర్టు చెప్పినా కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, తెలంగాణ రాష్ట్ర సమితి కల్వకుంట్ల కవిత అర్జీలు సుప్రీంకోర్టు ముందుకు వస్తే పూర్వోదంతం ప్రస్తావన తేకపోయినా వాదోపవాదాల క్రమంలో ఈ అంశాలే చర్చకు వస్తాయి. అరెస్టులు, నిర్బంధాల వల్ల దర్యాప్తులో ముందడుగు పడ్డ దాఖలాలే లేవు. జనం దృష్టిలో మాత్రం మోదీ ప్రభుత్వం ఆమ్ ఆద్మీ పార్టీ మీద కసి తీర్చుకుంటోందన్న అభిప్రాయమే పాతుకు పోయింది. ద్రవ్య అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని కటువైన 45వ సెక్షన్ మీద మాత్రమే ఆధారపడి ఈ వ్యవహారాన్ని తెగలాగే వన్నాగాలకు ఎప్పుడో ఒకప్పుడు తెర పడాల్సిందే. సంజయ్ సింగ్ విషయంలో అదే జరిగింది. మరో విషయం ప్రకారం కక్ష సాధింపు ధోరణి నిరంతరాయంగా కొనసాగక పోవచ్చు. కానీ ఆ క్రమంలోనే నిరపరాధు లైనప్పటికీ ఏ పాపం ఎరగని వారు సైతం దీర్ఘకాలం జైళ్లలో మగ్గిపోక తప్పదు. కీలకమైన వాస్తవాలను వెలికి తేవడంలోనే న్యాయస్థానాల పాత్ర విశేషమైందిగా నిలుస్తుంది. నిందితుడి నుంచి ప్రభుత్వం తరపు సాక్షిగా మారిన దినేశ్ అరోరా వ్యవహారంలోని లోగుట్టును న్యాయమూర్తులు కనిపెట్టి సంజయ్ సింగ్‌కు తాత్కాలిక ఉపశమనమైనా కలిగించడం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పాటుపడుతున్న వారికి ప్రేరణగా నిలుస్తుంది. కిరాతకమైన చట్టాలను ఇష్టానుసారం ఎల్లకాలం దుర్వినియోగం చేయడానికి వీలులేదని న్యాయమూర్తులు చెప్పకనే చెప్పినట్టయింది. కక్ష సాధించే చర్యలు అంతిమంగా న్యాయమార్గ పాలనకు విఘాతం కలిగించక మానవు. ద్రవ్య అక్రమ చెలామణి నిరోధక చట్టం వాస్తవానికి ఆయుధ, మాదక ద్రవ్య వ్యాపారుల ఆటకట్టించడానికి ఉద్దేశించింది అయినా మోదీ ప్రభుత్వం దీనిని తమ రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడానికి దుర్వినియోగం చేయడమే అసలు విషాదం. ఏమైతేనేమి సంజయ్ సింగ్ విషయంలో మోదీ సర్కారు కట్టిన దూది మేడలు కాలి బూడిదై పోయాయి.

మానవ హక్కుల యోధ

మన న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కొంతమంది వ్యవహరిస్తు న్నారని, ఇంతకు ముందున్నది స్వర్ణయుగం అని వాదిస్తున్నారని ఫిర్యాదు చేస్తూ 600 మంది న్యాయవాదులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌కు లేఖ రాయడం పెద్ద వివాదానికి దారి తీసింది. న్యాయ స్థానం తీర్పులను ప్రభావితం చేయ డానికి, న్యాయస్థానాలపై ప్రజల విశ్వాసం చెదిరి పోయేలా చేయడానికి ఇలా చేస్తున్నారని ఈ లేఖలో ఆరోపించారు. ఈ లేఖ మీద సంతకం చేసిన వారిలో ప్రసిద్ధ న్యాయవాది హరీశ్ సాల్వే, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు మనన్ కుమార్ మిశ్రా కూడా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. న్యాయ స్థానంలో బెంచీలను ఏర్పాటు చేయడంలో ఏదో మాయ జరుగుతోందని ఆరోపిస్తూ అలాంటి వారిని ఈ లేఖలో దుయ్యబట్టారు. ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తే వీరు ఎవరి పక్షాన ఉన్నారో తేలిపోతోంది. ఇలాంటివారి వైఖరిని ఖండిస్తూ ప్రసిద్ధ మానవ హక్కుల న్యాయవాది ఇందిరా జై సింగ్ "ది వైర్", "ది ఇండియన్ ఎక్స్ ప్రెస్" లో రెండు వ్యాసాలు రాశారు. ఇందిరా జైసింగ్ ఈ లేఖ వెనక ఉన్న బండారాన్ని బయట పెట్టారు. ఇందిరా జై సింగ్ ఎప్పుడూ బాధితుల పక్షాన నిలబడేవారే. ఆమె లాయర్స్ కలెక్టివ్ అని ఓ

సంఘం నిర్వహిస్తున్నారు. ఇది స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థ లైసెన్సును కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. విదేశీ విరాళాల నియం త్రణా చట్టాన్ని లాయర్స్ కలెక్టివ్ ఉల్లంఘిస్తోందని ఆరోపించి 2019లో లైసెన్సు రద్దు చేశారు. బొంబాయి హైకోర్టు లైసెన్సును రద్దు చేయడాన్ని నిలిపివేస్తూ తీర్పు చెప్పింది. కానీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అర్జీ పెట్టుకుంది. ఆ కేసు ఇప్పటికీ విచారణ లోనే ఉంది. ఇందిరా జైసింగ్ అణగారిన వర్గాల తరఫున నిలబడతారు. మహిళా పక్షపాతి. 1986లోనే ఆమెను బొంబాయి హైకోర్టు సీనియర్ న్యాయవాదిగా గుర్తిం చింది. 2009లో ఆమె అడిషనల్ సోలిసిటర్ జనరల్‌గా నియమితు లయ్యారు. ఈ స్థానంలో నియమితులైన మహిళల్లో ఆమే మొదటి వారు. ఆమె న్యాయవాద వృత్తి చేపట్టినప్పటి నుంచీ మానవ హక్కుల, మహిళా హక్కుల పరిరక్షణకోసం పోరాడుతూనే ఉన్నారు. మహిళలపై వివక్ష చూపడాన్ని ఆమె ఎప్పుడూ సహించలేదు. మేరీ రాయ్ కేసులో ఆమె న్యాయవాది. ఆమె వాదన నెగ్గినందువల్లే కేరళలో క్రైస్తవ మహిళలకు సమానమైన వారసత్వ హక్కులు దక్కాయి. మహిళల విషయంలో ప్రసిద్ధ పోలీసు అధికారి కేపీఎస్ గిల్ హద్దు మీరి ప్రవర్తించినప్పుడు ఐఏఎస్ అధికారి రూపన్ డియోల్ బజాన్ తరఫున వాదించింది కూడా ఇందిరా జైసింగే. కేపీఎస్ గిల్ పై చట్టరీత్యా చర్య తీసుకోవలసి రావడం జై సింగ్ వాదన ఫలితమే. లైంగికంగా వేధించిన వారికి శిక్ష పడేట్టు చేసిన మొట్ట మొదటి ఉదంతం ఇదే. తండ్రి ఎలాగైతే పిల్లలకు సంరక్షకుడో తల్లి కూడా సంరక్షకురాలే అన్న భావన కలగడానికి గీతా హరిహరన్ కేసులో జై సింగ్ వాదనలే ప్రధాన కారణం. మహిళలు క్రౌర్యానికి గురైనప్పుడు, భర్త వదిలేసినప్పుడు విడాకులు తీసుకోవడానికి అవకాశం కల్పించడంలో జై సింగ్ అద్వితీయమైన పాత్ర పోషించారు. అంతకు ముందు కేరళలో క్రైస్తవ మహిళలకు ఈ సందర్భంలో విడాకులు తీసుకునే అవకాశం ఉండేది కాదు. తీస్తా సెతల్వాద్‌ను గుజరాత్ ప్రభుత్వం వేటాడినప్పుడు ఆమె తరఫున వాదించింది కూడా జైసింగే. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదులుగా నియమించే ప్రక్రియను కూడా ఆమె సవాలు చేశారు. అవసరమైనప్పుడు సుప్రీంకోర్టుతో ఢీకొనడానికి కూడా ఇందిరా జైసింగ్ వెనుకాడలేదు. నూపుర్ శర్మ మీద మహమ్మద్ ప్రవక్తను అవమానించా రని అనేక ఎఫ్ఐఆర్‌లు దాఖలైనప్పుడు వాటన్నింటినీ ఒకే విడతలో పరిశీలిం చాలని పోరాడి సాధించిందీ జై సింగే. భోపాల్ గ్యాస్‌లీక్ బాధితుల తరఫున సుప్రీంకోర్టులో యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ మీద ఇందిరా జై సింగ్ పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. పంజాబ్‌లో హింసాకాండ జరిగి నప్పుడు చట్ట విరుద్ధంగా కొనసాగే హింసాకాండను, మనుషులు అమాంతం మాయమైపోవడం, 1979 నుంచి 1990 మధ్య మూకుమ్మ డిగా అనేక మందిని సమాధిచేసిన సందర్భంలోనూ బాధితు లకు బాసటగా నిలిచింది ఆమే. మైన్మార్‌లో రొహింగ్యా ముస్లిం లను భద్రతాదళాలు హత్య చేయడం, అత్యాచారాలకు పాల్ప డడం, చిత్ర హింసలు పెట్టినప్పుడు ఐక్యరాజ్య సమితి ఇందిరా జై సింగ్‌ను నిజనిరా రణ కమిషన్ సభ్యురాలిగా నియమించింది. జై సింగ్ పర్యావరణ పరి రక్షణ కోసం చేసిన పోరాటాన్నీ విస్మరించలేం. 1981లో ఆమె ప్రారం భించిన లాయర్స్ కలెక్టివ్ ప్రధాన ఉద్దేశం స్త్రీ వాదం, వామపక్ష వాదం, అన్నింటికన్నా ముఖ్యంగా మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పడిన సంస్థే. 1986లో సామాజిక న్యాయం, భారత చట్టాల ప్రకారం మహి ళల సమస్యల మీద దృష్టి నిలపడానికి ఆమె లాయర్స్ మాసపత్రిక కూడా నిర్వహించారు. ఈ క్రమం అంతా చూస్తే న్యాయవాద వృత్తిలో కొన్ని మౌలిక విలువలకోసం ఆమె కొనసాగించిన పోరాటం రూపు కడుతుంది. 2005లో ఆమెను పద్మశ్రీ అవార్డుతో సత్కరించారు. ఒక నిర్దిష్ట లక్ష్యం కోసం నిలబడేతత్వం ఉన్న వ్యక్తి కనకే 600 మంది న్యాయ వాదులు భారత ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖ వెనక ఎవరున్నారో నిర్భయంగా బయట పెట్ట గలిగారు. చట్టాలకు సంబంధించి ఆమె అయిదారు గ్రంథాలు రాశారు.

అనన్య వర్మ

సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం 'వ్యంగ్యభరితం'

దాక్టర్ జీకేడీ ప్రసాద్

ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల్లో వినూత్న పద్ధతుల్లో పార్టీల ప్రచారం తీవ్రంగా కొనసాగుతోంది. అధికారపక్షం మద్దతుదారులు విపక్షాలను, ప్రతిపక్షం అభిమానులు అధికార పక్షాన్ని దుర్భాషలాడుకుంటున్నాయనే చెప్పాలి. కుగ్రామాల్లోనూ వేగవంతమయిన అంతర్జాల సదుపాయం సామాన్యులకు సైతం స్మార్ట్‌ఫోన్ నుంచి భారీమొత్తంలో వినోదాన్ని అందిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే సినిమా, టెలివిజన్ ప్రసారాలను సైతం పక్కనపెట్టించిందని చెప్పాలి. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో దించిన తలఎత్తకుండా నిమగ్నమయిపోతున్నారంటే ఆశ్చర్యం లేదు. వెనకటికి పేకాటలో కూర్చున్నోడికి తల్లో, తండ్రో చచ్చిపోయారని ఇంటి నుంచి కబురొస్తే శవాన్ని ఈ దారిలోనే తీసుకెళ్తారు కదా..! ఆ జనంలో కలుస్తానులే అనే సామెత గోదావరి జిల్లాల్లో బహుళ ప్రచారంలో వుంది. ఇప్పుడు అది ఇంకా ఎక్కువ శాతం సామాజిక మాధ్యమాలకు కూడా వర్తిస్తుందనే చెప్పాలి. ఈ పరిస్థితి సామాజిక మాధ్యమాల్లో వివిధ అంశాలను ప్రసారంచేసే వృత్తి నిపుణులకు అనుకూలంగా మారింది. మంచి లాభసాటి వ్యాపారంగా కొనసాగుతోంది. చాలా రంగాలతోపాటు ఇప్పుడు రాజకీయమూ వీటిలో చేరింది. ప్రధాన స్రవంతి పత్రికలు, ఛానళ్లు పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నాయంటే నమ్మేజనం ఎవరూలేరు. ఈ నేపథ్యంలో నిర్భయంగా ఇక అభిప్రాయాలను వెల్లడించడానికి సామాజిక మాధ్యమాలు ఒక్కటే వేదికలయ్యాయి.

సామాజిక మాధ్యమాల్లో ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు తీవ్ర విమర్శలకు గురవుతున్నాయి. దీనిలో స్వతంత్రంగా కొంతమంది వ్యక్తులు, సంఘాలు నిర్మాణాత్మక విమర్శ చేస్తుండగా, విపక్షాలు పూర్తిగా వ్యంగ్యం, హాస్యం, హేళనలతో ప్రచారం కొనసాగిస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సప్ తదితర వేదికల్లో పోస్టులు, వీడియోలు, రీళ్లలను ప్రసారం చేస్తున్నాయి. ఈ ట్రోల్స్‌కి చాలా వేగంగా లక్షల్లో ప్రేక్షకాదరణ లభిస్తుంది. రేటు పలుకుంది. ప్రజల్లో భావోద్వేగాల్ని రేకెత్తించడానికి వివిధ సందేశాలను ఉపయోగిస్తున్నారు. ప్రజలు తమ ఆలోచనలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా పోస్ట్ చేయగల బహిరంగ మాధ్యమంలో ఎక్కడైనా ట్రోలింగ్‌కి విచ్చలవిడిగా అవకాశాలు లభిస్తున్నాయి. ఉదాహరణకు కొన్ని ఘటనలను పరిశీలిస్తే గతంలో ఎన్నడూ లేనివిధంగా బీజేపీ పాలనలో రాజకీయ నాయకులతో పాటు పారిశ్రామికవేత్తలకూ మీడియాలో సమాన ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామం మీద సామాజిక మాధ్యమాల్లో చాలా తీవ్రంగా వ్యంగ్య ప్రసారం జరుగుతూనే వుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది తన గెడ్డాన్ని చాలా పొడవుగా పెంచిన రోజుల్లో ఠాకూర్‌తో పోల్చారు. "అ అంటే అమలాపురం – ఆ అంటే ఆహాపురం" సినిమా గీతాన్ని పోలినట్టు "అ అంటే అంబానీ – అ అంటే అదానీ" అంటూ చాలా ట్రోలింగులు జరిగాయి. ఇటువంటివి ఇంకా చాలానే వున్నాయి. కేంద్ర, రాష్ట్రాలకు 2024 సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలయిన తర్వాత ఈ పరంపర మరింత వెర్రితలలేసింది. కేంద్ర రాజకీయాల మీద జరుగుతున్న ప్రచారం ఒక ఎత్తయితే ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ప్రచారం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. అధికార వైఎస్సార్ పార్టీ ఇంతవరకు

అమలుచేసిన పథకాలు, అభివృద్ధి గురించి చెప్పుకుంటుంది. సంక్షేమ పథకాల్లోను, అభివృద్ధిలోను నిజం లేదని ఇవన్నీ కేవలం తాత్కాలిక ఉపశమన కార్యక్రమాలేనని విపక్షాలు దుయ్యబడుతున్నాయి. మూడు రాజధానుల నిర్ణయంతో కాలయాపన జరిగిన విషయం మీద చాలా వీడియోలు ట్రోల్ అవుతున్నాయి. మద్యం మాఫియా, మాదకద్రవ్యాల అక్రమరవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్, గంజాయి, హత్యలు, దాడులు, విధ్వంసాలు, భూ కుంభకోణాలు, దురాక్రమణలు, అక్రమ మైనింగ్, పర్యావరణ చట్టాలను పక్కనబెట్టి కొండల తవ్వకాలు, ఆపై నిర్మాణాలు, న్యాయస్థానాల ఆదేశాలను పెడచెవిన పెట్టడం, మితిమీరిన సలహాదారుల నియామకాలు తదితర ప్రభుత్వ ధనాన్ని హరిస్తున్న అనేక విషయాలను సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజల ముందుకు తీసుకొస్తున్నారు.

తొలి అయిదేళ్ల తెలుగుదేశం పాలనలో అమరావతి రాజధానిగా తాత్కాలిక నిర్మాణాలు జరిగాయి. తర్వాత ప్రతిపక్షం నుంచి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు రాజధానులను ప్రకటించింది. చాలా నిరసనోద్యమాల మధ్య ఈ నిర్ణయం సర్వోన్నత న్యాయస్థానంలో నిలుపుదల అయింది. ఈ సందర్భాన్ని రాష్ట్రంలో చోటు చేసుకున్న ఎర్రచందనం, గంజాయి, డ్రగ్స్ మాఫియాలను మూడు రాజధానులుగా పోలుస్తూ సామాజిక మాధ్యమాల్లో రీళ్లు విచ్చలవిడిగా ప్రసారం జరుగుతున్నాయి. ఇవి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ సులభంగా లభిస్తున్న గంజాయి మీద సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్యంగా చాలా రీళ్లు ప్రసారమయ్యాయి. "ఇంటర్‌మీడియట్ చదువుతున్న విద్యార్థులకు తెలుస్తున్న గంజాయి జాడ వైసీపీ ప్రభుత్వంలో పోలీసులకు తెలియడం లేదు." అని చాలా మంది ట్రోల్ చేస్తున్నారు. రాష్ట్రంలో చీకటి మద్యం వ్యాపారం జరుగుతోందని ప్రజాసంఘాలు, విపక్షాలు పెద్ద ఎత్తున ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి మద్యం మీద ప్రభుత్వానికి వచ్చే పన్నుతో 'అమ్మఒడి' పథకాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి పన్నులను ప్రత్యేకించి ఏదో ఒక పథకం అమలు కోసం వనరుగా ప్రకటించలేదు. ప్రభుత్వ విధానాల్లో ఇదే తొలిసారి. ఈ విధానానికి మూలాధారం ఏమిటో ఉన్నతాధికారులకు లేదా చట్టసభలకు తెలియరాలేదు. "మద్యం మీద పన్ను అమ్మఒడి దన్ను", "అమ్మఒడి నాన్న గుడి" వంటి శీర్షికలతో కూడిన కొన్ని మందుబాబుల వీడియోలతో తీవ్రంగా ట్రోల్ జరిగింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున కట్టుబడి ఇసుక కొరత వచ్చింది. కరోనా రెండేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేవు. ఈ కష్టపరిస్థితుల నుంచి ఇసుక మాఫియా పుట్టుకొచ్చింది. అధికారపక్షానికి చెందిన నాయకులే ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడు తున్నారని విపక్షాలు దుయ్యబట్టాయి. ఈ సంద ర్భంలో "పగలు ఇసుక కొరత – రాత్రి లారీల వరద" శీర్షికన సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ జరిగింది. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం కోసం అధికార, విపక్షపార్టీలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయని తెలుస్తోంది. తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తు కుదిరిన తర్వాత పవన్‌కల్యాణ్‌ని 'దత్తపుత్రుడు' అని, లోకేశ్‌ని 'పప్పు', కొడాలి నానీని 'గుట్కా' అని చాలాకాలంగా సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ అవుతున్న సంగతి యావత్ ప్రపంచానికి తెలిసిందే. ఇలాంటిపనికి కొంత మంది మీడియా నిపుణుల్ని ఎంపికచేసి రెండు పార్టీల వారూ ప్రచారం చేయిస్తున్నారు. చివరకి అయిదేళ్ల వైసీపీ పాలనను ప్రశంసిస్తూ ఒక సినిమా, విపక్షాల మీద దుష్ప్రచారంతో మరో సినిమా ప్రభుత్వ మద్దతుదారులు థియేటర్లలో విడుదల చేశారు. ట్రయిలర్ పేరిట కొన్ని, పైరసీ ముసుగులో మరికొన్ని ముక్క ముక్కలుగా ఈ సినిమాల్ని ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. త్వరలో ఈ సినిమాలు పూర్తి స్థాయిలో ఓటీటీల్లోను, ఇతర సామాజిక మాధ్యమాల్లోను విడుదల కానున్నాయి. కొద్దిరోజుల్లోనే వైఎస్ వివేకానంద రెడ్డి హత్య ఘటన నేపథ్యంతో విపక్షాల మద్దతుదారులు ఒక సినిమాను యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఈ సినిమా పూర్తిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నేరస్తునిగా చూపిస్తూ తెరకెక్కించిన సినిమా. ఈ సినిమా మీద వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె మీడియా సమావేశంలో స్పందించారు. దీనిని సినిమా అంటారో డాక్యుమెంటరీ అంటారో నాకు తెలియదు కాని వివేకానంద రెడ్డి హత్య సిబిఐ రిపోర్టు ఆధారంగానే చిత్రీకరించారు. అయినప్పటికీ నిజానిజాలు ఇంకా తీవ్రంగా వున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా తయారీదారులు చాలా ధైర్యం చేశారని ప్రశంసించారు. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్, పోలింగ్ తేదీకి మరికొన్ని రోజులు వ్యవధి వుంది. ఈ లోగా సామాజిక మాధ్యమాల్లో ఇంకా అధిక సంఖ్యలో వివిధ చిత్రాలు, వీడియోలు చోటు చేసుకుంటాయని ఊహించొచ్చు. ఇవి ప్రజల్ని ఎంత వేడిక్కిస్తాయో, వారిబుర్రల్లోకి ఎంత వ్యంగ్యానెక్కిస్తాయో అంచనా వేయడం కష్టమే. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం వుందని మీడియా నిపుణులు భావిస్తున్నారు.

సెల్: 9393 111 740

మళ్లీమోదీ గెలిస్తే దేశానికి అధోగతే

ఈ-మెయిల్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీయే తిరిగి వస్తే దేశం అధోగతే అనడంలో ఎటువంటి అనుమానంలేదు. భిన్నమతాలు, భిన్న సంస్కృతులు, భిన్న ఆచారాలూ కలిగిన మన దేశానికి లౌకికవాదం ఒక్కటే శరణ్యం. పాలనలో ఎక్కడా మతపరమైన ఆచారాలు ఉండరాదు. మతాన్ని పాలకులు వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి. అందుకోసమే మన ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1955లో నాగార్జునసాగర్‌కు శంకుస్థాపన సమయంలో పూజలు, ముహూర్తం, మంత్రాలు, పూజారి లేకుండానే ఒకదీపం వెలిగించి, ఈ ఆధునిక దేవాలయాన్ని జాతికి అంకితం చేస్తున్నాను అన్నారు. పాలకులు అలా ఉంటేనె లౌకిక వాదానికి రక్ష. అయితే, మోదీ వచ్చిన తరువాత పరిపాలన అంతా మతమయం అయిపోయింది. మతానికి మారుపేరులైన స్వామీజీలను, బాబాలను మోదీ మోస్తున్నారు. సుప్రీంకోర్టు నిన్న కూడా చీవాట్లుపెట్టిన రాం దేవ్ బాబా మోదీకి అత్యంత ఆత్మీయుడు. వివాదాస్పద బాబాలు జగ్గి బాబా, రవి శంకర్ ఏజాతర ప్రారంభించినా మోదీ ప్రారంభించాల్సిందే !ఈ మధ్య పార్లమెంటు నూతన భవనం ప్రారంభం సమయంలో బేతాళమాంత్రికులను పిలిపించి, 150 కోట్ల దేశప్రజలకు అధిపతిగా ఉన్న మోదీ దొంగబాబాల పాదాలకు మొక్కి దేశ ప్రజలను అవమానపరచాడు. తిరిగి మేమే గెలిస్తే రాజ్యాంగంలోని లౌకికవాదాన్ని తొలగిస్తామని బీజేపీ నేతలు నేరుగానే చెపుతున్నారు. వీరికి ప్రజల మీద కంటే ఆవు మూత్రం, ఆవు పేడ మీద భక్తి ఎక్కువ. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో విద్యార్థులకు చరిత్ర పాఠాలు తొలగించి భారతం, రామాయణం, గీత లాంటి పుక్కిటి పురాణాలను పాఠ్యాంశాలుగా బోధిస్తున్నారు. అ శాస్త్రీయమైన వాస్తు జ్యోతిష్యాలను చదివిన వారికి మోసంచేసి బతకండని పట్టాలిస్తున్నారు. అంతేకాదు విశాఖ స్టీల్‌ప్లాంటును అమ్మాలని కేంద్రం చూస్తోంది. అయితే, గత కొన్ని నెలలుగా కార్మికులు, స్థానికులు, కేంద్ర కార్మిక సంఘాలు, వామపక్ష, లౌకిక శక్తులు నిర్వహిస్తున్న ఆందోళన కారణంగా మోదీ ప్రభుత్వం ఆ సాహసం చేయలేకపోయింది. టెలికం, బీమా, బ్యాంకులు, నౌకాయానాలు లాంటి కేంద్రప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోంది. ఒక ఎద్దుని అమ్మకం పెట్టాలంటే దాన్ని బాగా సోకుగా వుండేట్టుచేసి అమ్మినట్లుగా, ఇప్పుడు అన్నీ రైల్వే స్టేషన్లను మరమ్మతులు చేసి, అందంగా తయారుచేసి , కొనేవాడికి బాగా నచ్చేట్లు చెయ్యటానికి అన్ని రైల్వే స్టేషన్లను కేంద్రం ముస్తాబు చేస్తోంది. ఎందుకంటే కొనేవాడు సరుకు బాగా కనపడితేనే కదా కొనేది !! అయోధ్య రామమందిరానికి విమానాలు వెయ్యమని ఎవరు అడిగారు ?వందే భారత్, వందేమాతరం రైళ్లు వెయ్యమని ఎవరు అడిగారు?. విజయవాడ రైల్వే డివిజన్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయం దాదాపు ఆరువేల కోట్లు. ఇంత ఆదాయం వస్తున్నా కూడా సీనియర్ సిటిజెన్స్‌కి ఛార్జీలో రాయితీ ఎందుకు కొనసాగించడంలేదో మోదీ చెప్పాలి. మళ్లీ మోదీని గెలిపిస్తే దేశానికి అధోగతి తప్పదు.

నార్నె వెంకటసుబ్బయ్య

డబ్బుకు సీటు దాసోహం కారాదు

డా.డీవీజీ శంకరరావు

దేశ ఆర్థిక శాఖను నిర్వహిస్తున్న మంత్రి నిర్మలా సీతారామన్ తాను డబ్బు లేకపోవడం వల్ల ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదంటూ ప్రకటించడం విచారకరం. 'ఊరుకోండి మేడం, మీ దగ్గర డబ్బు లేకపోవడమేమిటి' అని ఓ జర్నలిస్టు ప్రశ్నించగా, దేశం సొమ్ము నా వ్యక్తిగతం కాదు కదా అని తగిన విధంగానే స్పందించారు.నిజమే కదా! కానీ ఒక జాతీయ స్థాయిలో ప్రముఖమైన వ్యక్తి ఒక ఎన్నికలో నిలబడేందుకు కూడా జంకే పరిస్థితి ఉండడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. అయితే అది పాక్షిక సత్యమే. సొంత పార్టీ తలిస్తే ఆమె అభ్యర్థి కావడం ఏమంత కష్టం కాదు కదా. ఆ పార్టీకి నిధులలేమి బాధ లేదు కదా! అలా తలవక పోవడానికి వేరే కారణాలు ఉండొచ్చు కానీ డబ్బు మాత్రం ఏకైక కారణం అంటే నమ్మశక్యం కాదు. నేనింతవరకూ మూడుసార్లు ఎన్నికల బరిలో ఉన్నాను. మొదటిసారి తెలుగుదేశం 1999లో తటస్థ వ్యక్తుల్ని పార్టీలోకి ఆహ్వానిస్తూ టికెట్‌లు కేటాయించి నప్పుడు నా దగ్గర డబ్బులేని సంగతి ఆటంకం కాలేదు. పార్టీ ఎన్నికల ఖర్చు భరించింది. గెలిచాను. 2004లో మళ్లీ నాకు అవకాశం ఇచ్చింది. స్వల్ప తేడాతో ఓడిపోయాను. అప్పుడు కూడా నా స్థాయికి మించిన ఖర్చు నా నుంచి ఎవరూ ఆశించలేదు. మళ్లీ 2009లో ఎన్నికల వేళ 'డబ్బులు లేవని అనకు...రాజకీయాల్లో అలా అనకూడదు. అలా అన్నావంటే టికెట్ ఇవ్వరు. బాగా ఉన్నాయని చెప్పాలి' అంటూ మిత్రులు చెప్పుండేవారు. నేను ఒప్పుకోలేదు 'అలాంటి అబద్ధాలు అవసరం లేదు. ఉన్నది ఉన్నట్టు చెప్పడానికి సిగ్గెందుకు' అంటూ. అయితే పార్టీతో అలాంటి సంభాషణ అవసరమే పడలేదు. ఇద్దామనుకున్న అరకు పార్లమెంట్ సీటు మిత్ర పక్షానికి కేటాయించింది టీడీపీ. నాకు సాలూరు అసెంబ్లీ సీటు ప్రకటిం చారు. పై నుంచి కింది వరకు ఎక్కడా డబ్బుల ప్రస్తావన రాలేదు. ఇంతలో మళ్లీ నా బి ఫామ్ మార్చి వేరే అభ్యర్థికి ఇచ్చారు. అలా ఎందుకు చేశారో, అంత బలమైన కారణం ఏమిటో తెలియదు.

అయితే అందుకు నా దగ్గర డబ్బు లేకపోవడమే కారణం కావొచ్చని ఊహిస్తూ ఆ నియోజక వర్గంలో అన్ని మండలాల నాయకులు అధిష్టానానికి టెలిగ్రామ్‌లు పంపారు.. 'మాకు పార్టీ పైసా ఇవ్వొద్దు. అభ్యర్థి తరఫున ప్రచారం తదితర ఖర్చులు మేమే భరిస్తాం. అవసరమైతే తిరిగి మేమే ఇస్తాం' అంటూ. ఒకరిద్దరు 'ఎన్నికల ఖర్చుని చూసి వెనుకాడవద్దు. మాది పూచీ' అని కూడా అన్నారు. అయితే నేను మంచి మిత్రులు అనుకున్న వారంతా మొఖం చాటేశారు. కనీసం నైతిక మద్దతు కూడా ప్రకటించలేదు. పార్టీ నిర్ణయానికి ఎదురెళ్లడం ఇష్టం లేక పద్దన్నాను. ఇక 2014 ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడినందున టీడీపీకి రాజీనామా చేసి నా ఉద్యోగం నేను చేసుకున్నాను. 2019లో ఆఖరు నిమిషంలో సీపీఐ అధినేత నన్ను పాలకొండ నుండి పోటీ చేస్తారా అని అడిగారు. ఐదు పార్టీలు కలిసి ఒక సామాజిక మార్పు దిశగా పోటీ చెయ్యడమన్న భావన నచ్చింది. సరే అన్నాను. వారు కూడా ప్రచారం తదితర ఖర్చులు మేమే చూసుకుంటామని, ఇబ్బంది పడవొద్దని చెప్పారు. నేను ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తానని భావించి దగ్గరైన కొందరు మిత్రులు, అలా కాకపోయే సరికి జంప్ అయ్యారు. నా క్లాస్‌మేట్ డాక్టర్లలో ఒక పది మంది వరకూ ఉడుతాసాయం చేశారు. రాజమండ్రిలో ఒక చిన్న పత్రిక ప్రజా పత్రిక కొన్ని కరపత్రాలు ఉచితంగా వేసింది. ఏమీ ఆశించకుండా ఎంతోమంది ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఏ ఊరు వెళ్లినా అందరూ ఆదరించారు. అయితే ఓట్లు వెయ్యలేదు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే టికెట్ కేటాయింపులో ఎన్నో లెక్కలు పనిచేస్తాయి. అధిష్టానం డబ్బు ఒక్కటే ముఖ్యమని అనుకోదు. ఇవ్వకూడదనుకుంటే అది ఒక సాకుగా చూపుతుందేమో గానీ. అలాగే కేడర్ కూడా డబ్బు లేకపోతే కదిలేది లేదు అనరు. నమ్మితే తామే కష్టపడతారు.ఇదంతా ఒక కోణం. ఇంకో కోణం ఏమిటంటే ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత విపరీతంగా పెరిగిపోవడం. డబ్బు విషయం పట్టించుకోకుండా ఎంతమందిని ప్రధాన పార్టీలైనా నిలప గలవు? అక్కడక్కడా ప్రయోగాలు చేయగలవు గానీ మెజారిటీ సీట్లలో కుదరదు కదా! ఎదుటి పార్టీ విచ్చల విడిగా ఖర్చు చేస్తున్నప్పుడు, ఎంతోకొంత చెయ్యకపోతే ఓటమి తప్పదు కదా! ఇలా పార్టీలన్నీ ఒక విషవలయంలో చిక్కుకున్నాయి. ఆ వలయాన్ని దాటి రావడం అంటే గెలుపు సంగతి మర్చిపోవడమే అన్నట్టు తయారైంది. ఇక నిధులు లేని పార్టీలు, ఇండిపెండెట్‌లు గోదాలో ఉండడమే గగనంగా మారుతోంది. ఈ పరిస్థితి మారనంత వరకూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నట్టే. డబ్బు ప్రమేయంలేని ఎన్నికల వ్యవస్థ సాధించే దిశగా దేశం ఆలోచించాలి. ఎన్నికల్లో గెలవడం సంగతి పక్కన పెడితే, నిలవడానికి దేశ ఆర్థిక మంత్రి జంకాల్సి రావడం శుభసూచకం కాదు.

సెల్ : 9440836931.

33 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానానికి తెర

- మన్మోహన్ రాజ్యసభ పదవీకాలం ముగింపు
- మొత్తం 54 మంది సభ్యులు కూడా...

న్యూదిల్లీ: రాజ్యసభ నుంచి మొత్తం 54 మంది సభ్యులు బుధవారం పదవీ విరమణ చేశారు. వారిలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ (91)తోపాటు 9 మంది కేంద్ర మంత్రులు ఉన్నారు. కొందరు ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. రాజ్యసభ సభ్యుడిగా కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ మన్మోహన్‌సింగ్ 33 ఏళ్ల సుదీర్ఘ పార్లమెంటరీ ప్రస్థానం బుధవారంతో ముగిసింది. అనేక సాహసోపేత సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మన్మోహన్...1991 అక్టోబరులో మొదటిసారిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆర్థిక సంస్కరణలకు నాంది పలికారు. 2004 నుంచి 2014 వరకు పదేళ్లపాటు యూపీయే హయాంలో దేశ ప్రధానిగా సేవలందించారు. మన్మోహన్ పదవీకాలం ముగియటంతో ఆయన స్థానంలో ఇటీవల రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ తొలిసారిగా ఎగువసభలో అడుగుపెట్టనున్నారు. రాజ్యసభ నుంచి పదవీవిరమణ చేస్తుండటంతో మన్మోహన్ సింగ్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశంసలు కురిపించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయనను 'మధ్య తరగతి.. యువత ఆకాంక్షల హీరో' అని కితాబిచ్చారు. 'మీరు క్రియాశీల రాజకీయాల నుంచి విరమించుకున్నప్పటికీ వీలైనంత మేర మన దేశ పౌరులతో మాట్లాడట ద్వారా జాతికి జ్ఞానం, నైతిక దిక్సూచిగా ఉండాలని నేను ఆశిస్తున్నాను. మీకు శాంతి, ఆరోగ్యం, ఆనందాన్ని ఇవ్వాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నాను' అని ఖర్గే తన లేఖను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మీరు చేపట్టిన సంస్కరణల ప్రయోజన ఫలాలను ప్రస్తుత నాయకులు రాజకీయ పక్షపాతాల కారణంగా మీకు క్రెడిట్ ఇవ్వడానికి ఇష్టపడరు' అని ఖర్గే వ్యాఖ్యానించారు. 'చాలా కొద్దిమంది మాత్రమే మన దేశానికి మీ కంటే ఎక్కువ అంకితభావంతో సేవ చేశారని చెప్పగలరు. మీలాంటి చాలా తక్కువ మంది మాత్రమే దేశం, ప్రజల కోసం చేయాల్సింది చేశారు. మన్మోహన్ సింగ్ నిత్యం మధ్యతరగతి, యువత ఆకాంక్షలకు 'ప్రతినిధి'.. పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకులకు నాయకుడు, మార్గదర్శకుడు, మీ ఆర్థిక విధానాల వల్ల పేదరికం నుంచి బయటపడగలిగిన పేదలందరికీ శ్రేయోభిలాషిగా ఉంటారు.' అని ఖర్గే తన లేఖలో రాశారు. 'పెద్ద పరిశ్రమలు, యువ పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారాలు, వేతన వర్గాలు, పేదలకు సమానంగా ప్రయోజనకరమైన ఆర్థిక విధానాలు అనుసరించడం సాధ్యమవుతుందని మీరు చూపించారు.

పేదలు కూడా దేశాభివృద్ధిలో పాలుపంచుకోవచ్చని, అభివృద్ధి చెందగలరని మీరు చూపించారు. పేదరికం నుంచి బయటపడ్డారు.. ప్రధానిగా ఉన్న సమయంలో మీ విధానాల వల్లే ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్న 27 కోట్ల మంది పేదలను భారతదేశం పేదరికం నుంచి బయటపడేసింది' అని ఆయన అన్నారు.

మన్మోహన్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంక్షోభ సమ యాల్లో గ్రామీణ కార్మికులకు ఉపశమనం కలిగిస్తోందని ఖర్గే పేర్కొన్నారు. 'ఈ పథకం ద్వారా వారు జీవనోపాధి పొందగలరని, ఆత్మగౌరవంతో జీవించగలరని భరోసా ఇచ్చినందుకు దేశం ముఖ్యంగా గ్రామీణ పేదలు మిమ్మల్ని నిత్యం గుర్తుంచుకుంటారు' అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి పదవికి సింగ్ తెచ్చిన బలమైన గౌరవాన్ని దేశం కోల్పోతుందని ఖర్గే వ్యాఖ్యానించారు. 'పార్లమెంటు ఇప్పుడు మీ జ్ఞానం, అనుభవాన్ని కోల్పోతుంది. మీ గౌరవప్రదమైన వ్యాఖ్యలు, మృదుస్వభావి ఇంకా రాజనీతిజ్ఞుడి లాంటి మాటలు ప్రస్తుత రాజకీయాలను సూచించే అబద్ధాలతో నిండిన పెద్ద గొంతులకు భిన్నంగా ఉంటాయి.. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో నిష్కపటమైన నాయకత్వానికి 'అనైతికత'ని సమానం చేస్తున్నారు.. నోట్లరద్దుపై మీరు చేసిన ప్రసంగాన్ని 'స్మారక నిర్వహణ వైఫల్యం'గానూ, 'వ్యవస్థీకృత దోపిడీ, చట్టబద్ధమైన దోపిడీ'గానూ అభివర్ణించడం నాకు ఇప్పటికీ గుర్తుంది.. వ్యక్తిగతంగా లేకుండా విమర్శించడం సాధ్యమని మీరు నిరూపించారు. ప్రస్తుత ప్రభుత్వ అబద్ధాలను దేశం, ప్రజలు త్వరలో చూస్తారు. సూర్యచంద్రులను ఎలా దాచలేమో, నిజాన్ని కూడా దాచలేం.. ప్రజలు మీ మాటల ప్రాముఖ్యతను త్వరలోనే గుర్తిస్తారు' అని ఖర్గే స్పష్టం చేశారు.

9న చెన్నైలో ప్రధాని ప్రచారం



చెన్నై: తమిళనాడు లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 9న చెన్నైలో రోడ్‌షో నిర్వహిస్తారు. ఈ నెల 19న రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. దీంతో అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించి, క్షేత్రస్థాయిలో ముమ్మరంగా ప్రచారంలో నిమగ్నమయ్యాయి. 9న రాజధాని చెన్నై మహానగరంలో స్థానిక టి.నగర్‌లోని పనగల్ పార్క్ నుంచి తేనాంపేట సిగ్నల్ వరకు రోడ్‌షో నిర్వహిస్తారు. ఈ నెల 12న మోదీ మరోమారు రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆ రోజున ధర్మపురిలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలో డీఎండీకే, పీఎంకే, మరికొన్ని చిన్నాచితక పార్టీలు కలిసి 39 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో కనీసం నాలుగు నుంచి ఐదు ఎంపీ సీట్లను స్వతహాగా గెలుచుకోవాలన్న పట్టుదలతో కమలనాథులు ఉన్నారు.

బీజేపీ నేత సుశీల్ మోదీకి కేన్సర్

పాట్నా: బీజేపీ సీనియర్ నేత, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఎక్స్ వేదికగా బుధవారం వెల్లడించారు. ఆరు నెలలుగా తాను కేన్సర్‌తో పోరాడుతున్నానని, అనారోగ్యం కారణంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోతున్నానని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏమీ చేయలేనని, ప్రధాని మోదీకి తన సమస్యను వివరించానన్నారు. ఈ దేశానికి, బీహార్ ప్రజలకు, బీజేపీకి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. తన జీవితం ప్రజాసేవకు అంకితమని, దేశ సేవలో ఎప్పుడూ ముందుంటానని రాసుకొచ్చారు. 72 ఏళ్ల సుశీల్ కుమార్ బిహార్ రాజకీయాల్లో సీనియర్ నేతగా ఉన్నారు. 2005 - 2020 మధ్య కాలంలో సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంలో రెండుసార్లు ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు.

ఉద్ధవ్ పార్టీ గూటికి బీజేపీ ఎంపీ

ముంబై: లోక్‌సభ ఎన్నికలకు ముందు మహారాష్ట్రలో కాషాయ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రానున్న ఎన్నికలకు ఉత్తర మహారాష్ట్రలోని జలగావ్ నుంచి టికెట్ దక్కకపోవడంతో బీజేపీ ఎంపీ ఉన్మేశ్ పాటిల్ బీజేపీకి రాజీనామా చేశారు. కాషాయ పార్టీ వీడిన పాటిల్ బుధవారం శివసేన (యూబీటీ)లో చేరారు. పార్టీ అధినేత, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నివాసంలో ఉన్మేశ్ పాటిల్ తన సహచరులతో కలిసి సేనలో చేరారు. పాటిల్ శివసేన (యూబీటీ)లో చేరడంతో జలగావ్ ప్రాంతంలో బీజేపీకి నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. పాటిల్ రాకతో శివసేన (యూబీటీ)లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని, ఆయన చేరికతో పార్టీ కార్యకర్తల మనోస్థైర్యం పెరుగుతుందని సేన వర్గాలు పేర్కొన్నాయి.

బిలియనీర్ల జాబితాలో రేణుకా జగిత్యాని

ముంబై: కొత్త బిలియనీర్ల జాబితాను ఫోర్బ్స్ విడుదల చేసింది. భారత్‌కు చెందిన 25 మందికి జాబితాలో చోటుదక్కింది. తాజాగా జాబితాలో రేణుకా జగిత్యాని ఉన్నారు. ఆమె ల్యాండ్‌మార్క్ గ్రూపు సీఈవో. ఆమె సంపద 4.8 బిలియన్ డాలర్లు. ల్యాండ్‌మార్క్ గ్రూపును రేణుక భర్త మిక్కీ జగిత్యాని స్థాపించారు. ఆయన గత ఏడాది మేలో మరణించారు. ల్యాండ్‌మార్క్ గ్రూపులో సుమారు 50 వేల మంది ఉద్యోగం చేస్తున్నారు. ముంబై యూనివర్సిటీ నుంచి ఆమె ఆర్ట్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చేశారు. 2007లో ఆమెకు ఔట్‌స్టాండింగ్ ఏషియన్ బిజినెస్ ఉమెన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కింది. 2012లో గల్ఫ్ బిజినెస్ పరిశ్రమ ఆమెకు బిజినెస్ ఉమెన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు అందజేసింది. 2014లో ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ద వరల్డ్ ఇయర్ అవార్డు గెలుచుకున్నారు. 2017లో వరల్డ్ రిటేల్ కాంగ్రెస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఆమెకు చోటు దక్కింది. ల్యాండ్‌మార్క్ గ్రూపులో రేణుక 1993లో చేరారు. మిడిల్ ఈస్ట్‌లో తమ సంస్థ విస్తరణ కోసం ఆమె తీవ్రంగా శ్రమించారు. భారత ఉపఖండం, పశ్చిమాసియా, ఆఫ్రికాలోనూ రిటేల్ బిజినెస్ విస్తరణకు కృషి చేశారు. రేణుకకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆర్తి, నిషా, రాహుల్. ముగ్గురూ ల్యాండ్‌మార్క్ కంపెనీలో గ్రూపు డైరెక్టర్లుగా చేస్తున్నారు.

కశ్మీర్‌లో పీడీపీ, ఎన్‌సీ పరస్పరం పోటీ

శ్రీనగర్: 'ఇండియా' కూటమిలో భాగస్వామ్య పార్టీలు పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ), నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) లోయలోని మూడు లోక్‌సభ స్థానాల్లో పరస్పరం పోటీకి దిగుతున్నాయి. ఎన్‌సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా తమను 'విడిచిపెట్టారని' మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని పీడీపీ ఆరోపించింది. అయితే ఆమె వ్యాఖ్యలను అబ్దుల్లా తిప్పికొడుతూ, 2020లో జిల్లా అభివృద్ధి మండలి (డీడీసీ) ఎన్నికలకు పీపుల్స్ అలయెన్స్ ఫర్ గుప్కర్ డిక్లరేషన్ (పీఏజీడీ) లోని సభ్యుల మధ్య కుదిరిన అవగాహన మేరకు పీడీపీ వెనక్కి వెళుతోందని తెలిపారు. ముఫ్తీ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కశ్మీర్‌లోని మూడు లోక్‌సభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా ఎన్‌సీ తమ పార్టీని విడిచిపెట్టిందని అన్నారు. 'అభ్యర్థులను ఎంపిక చేయడం, పోటీకి నిలబెట్టడం తప్ప వారు మరే అవకాశం ఇవ్వలేదు' అని ముఫ్తీ తెలిపారు. తమ పార్టీ పార్లమెంటరీ బోర్డు అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. జమ్ముకశ్మీర్‌లో సీట్ల పంపకంపై కాంగ్రెస్‌తో చర్చలు జరుపుతున్నప్పుడు 2019 లోక్‌సభ ఎన్నికల్లో తాము గెలిచినందున మూడు లోయ స్థానాల్లో పోటీ చేస్తామని ఎన్‌సీ స్పష్టం చేసింది. 'ఇండియా' కూటమి సీట్ల భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్‌కు జమ్మూలో రెండు స్థానాలను ఎన్‌సీ వదిలివేసింది. 2019 ఆగస్టులో కేంద్రం ప్రత్యేక హోదాను రద్దు చేసిన తర్వాత జమ్ము కశ్మీర్‌లో రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఫ్తీ అన్నారు. యువత జైళ్లలో ఉన్నారని, గొంతు ఎత్తలేకపోతున్నామని, ఉద్యోగుల కుటుంబ సభ్యులు కూడా ఏమీ చెప్పలేకపోతున్నారని, ఇక్కడ అణచివేత వాతావరణం నెలకొని ఉందని, అలాంటి వాతావరణంలో మనం ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఎన్‌సీ నాయకత్వం వైఖరి నిరాశపరిచిందని, బాధ కలిగించిందని మాజీ ముఖ్యమంత్రి తెలిపారు. నిర్ణయాన్ని ప్రకటించే ముందు ఎన్‌సీ తనను సంప్రదించి ఉంటే, కశ్మీర్ విశాల ప్రయోజనాల దృష్ట్యా అభ్యర్థులను నిలబెట్టకూడదని తమ పార్టీ నిర్ణయించుకుని ఉండేదని ముఫ్తీ అన్నారు. 'కానీ ఒమర్ (అబ్దుల్లా) మమ్మల్ని విశ్వాసంలోకి తీసుకోకుండా నిర్ణయం ప్రకటించడం నా పార్టీ కార్యకర్తలను బాధించింది' అని తెలిపారు.

కతువాలో ఎన్‌కౌంటర్

గ్యాంగ్‌స్టర్ సహా పోలీస్ అధికారి మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కతువాలో గల ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసి) ప్రాంగణంలో పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక గ్యాంగ్‌స్టర్ మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా... ఎదురు కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన సబ్ ఇన్‌స్పెక్టర్ దీపక్ శర్మ కూడా మృతిచెందారు. ఎన్‌కౌంటర్‌లో తలపై బుల్లెట్ గాయం కావడంతో సబ్ ఇన్‌స్పెక్టర్ శర్మకు కతువాలో ప్రాథమిక చికిత్స అనంతరం పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచినట్లు అధికారులు తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శర్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. 'కతువాలో మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్‌తో ధైర్యంగా పోరాడి ప్రాణ త్యాగం చేసిన పీఎస్ఐ దీపక్ శర్మ శౌర్యం, అలుపెరగని ధైర్యానికి నేను వందనం చేస్తున్నాను. అతని అత్యున్నత త్యాగం మా హృదయాలలో నిలిచిపోతుంది. అమరవీరుడు దీపక్ శర్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు. మృతి చెందిన అధికారి చిందించే ప్రతి రక్తపు బొట్టుకు ప్రతీకారం తీర్చుకుంటామని సిన్హా అన్నారు.

12 మంది రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారం

న్యూదిల్లీ: రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్ కొత్త సభ్యులతో ప్రమాణం చేయించారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, ఆర్జేడీ నేత మనోజ్ కుమార్ ఝా సహా మొత్తం 12 మంది సభ్యులు పెద్దల సభకు ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఎల్. మురుగన్, ధర్మశీల గుప్తా, మనోజ్ కుమార్ ఝా, సంజయ్ యాదవ్, గోవింద్‌భాయ్ లాల్జీభాయ్ ధోలాకియా, సుభాశ్ చందర్ హర్ష్ మహాజన్, జీసీ చంద్రశేఖర్, అశోక్ సింగ్ చంద్రకాంత్, హండోరే మేధా, విశ్రమ్ కులకర్ణి, సాధన సింగ్ ఉన్నారు. కేంద్రమంత్రులుగా కొనసాగుతున్న ఏడుగురి రాజ్యసభ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. వీరిలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ, పశు సంవర్ధక, మత్స్య శాఖమంత్రి పురుషోత్తం రూపాలా, ఐటీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి నారాయణ్ రాణే, సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ ఉన్నారు. పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఈ కేంద్ర మంత్రులందరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా 7న ఆప్ నాయకుల నిరాహార దీక్ష

న్యూదిల్లీ : దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఏప్రిల్ 7వ తేదీన ఇక్కడి జంతర్ మంతర్ వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకులు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పార్టీ నాయకుడు గోపాల్ రాయ్ బుధవారం తెలిపారు. తమ పార్టీ జాతీయ కన్వీనర్ అరెస్టుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరాహార దీక్షలకు పిలుపు ఇచ్చినట్లు కేజ్రీవాల్ ప్రభుత్వం క్యాబినెట్ మంత్రి కూడా అయిన రాయ్ విలేకరుల సమావేశంలో చెప్పారు. 'మీరు దిల్లీ ముఖ్యమంత్రి అరెస్టుకు వ్యతిరేకంగా ఉంటే, ఏప్రిల్ 7న దానికి వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయవచ్చు. అది మీరు ఎక్కడైనా ఇంట్లో, మీ నగరంలో, ఎక్కడైనా సామూహిక నిరాహార దీక్షలు చేయవచ్చు' అని అన్నారు. 'ఆప్‌ను నిర్మూలించే లక్ష్యం' తోనే పార్టీ అగ్రనేతను అరెస్టు చేశారని విమర్శించారు. 'ఏప్రిల్ 7న దిల్లీ ప్రభుత్వ మంత్రులు, ఆప్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, ఆఫీస్ బేరర్లు, జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపడతారు. ఇది బహిరంగ కార్యక్రమం. విద్యార్థి సంఘాలు, రైతు సంఘాలు, వ్యాపారులు వచ్చి పాల్గొనవచ్చు' అని ఆయన తెలిపారు.

కేజ్రీవాల్ బరువు తగ్గలేదు

తీహార్ జైలు అధికారుల వివరణ

న్యూదిల్లీ: దిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో తీహార్ జైలులో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్ బరువు తగ్గిపోయారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన ఆరోపణలను జైలు అధికారులు తోసిపుచ్చారు. కేజ్రీవాల్ బరువు యథాతథంగా 65 కిలోలు ఉందని తెలిపారు. జైలుకు వచ్చినప్పుడు ఎంత బరువు ఉన్నారో ఇప్పుడు కూడా అంతేనని వివరణ ఇచ్చారు. అయితే, దిల్లీ మంత్రి అతిశి మరోసారి తన వాదనకు పదునుపెట్టారు. కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీలోకి తీసుకున్నప్పుడు ఆయన బరువు 69.5 కిలోలు ఉన్నట్టు చెప్పారు. కేజ్రీవాల్ బరువు తగ్గారంటూ వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ తీహార్ జైలు అధికారులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024 ఏప్రిల్ 1న ఆయన జైలుకు వచ్చారని, అప్పుడు ఇద్దరు వైద్యులు పరీక్షలు చేశారని, ముఖ్యమైన అవయవాల పనితీరు సాధారణంగా ఉందని ఆ ప్రకటన తెలిపింది. ఆయన జైలుకు వచ్చినప్పటి నుంచి ఈరోజు వరకూ 65 కిలోల బరువులో ఎలాంటి మార్పూ లేదని, కోర్టు ఆదేశాల ప్రకారం ఆయనకు ఇంటి భోజనం అందిస్తున్నామని తెలిపింది. మెడికల్ పారామీటర్స్ కూడా నార్మల్‌గా ఉన్నాయని స్పష్టం చేసింది. కాగా, కేజ్రీవాల్‌ను అరెస్టు చేసినప్పుడు ఆయన బరువు 69.5 కిలోలు ఉండగా, అప్పట్నుంచి 12 రోజుల్లో 4.5 కిలోల బరువు తగ్గారని అతిశి తెలిపారు. డయాబెటిస్‌తో ఆయన బాధపడుతున్నారని, ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ ఆయన దేశం కోసం 24 గంటలూ శ్రమపడుతున్నారని చెప్పారు. అరెస్టయినప్పటి నుంచి 4.5 కిలోల బరువు తగ్గడం తీవ్ర ఆందోళన కలిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్‌ను జైలులో పెట్టించడం ద్వారా ఆయన ఆరోగ్యాన్ని ప్రమాద స్థితిలోకి బీజేపీ నెట్టేసిందని, ఆయనకు ఏదైనా జరిగితే యావద్దేశం మరిచిపోయినా భగవంతుడు మాత్రం వారిని క్షమించడని అన్నారు.

'ఇంటింటికీ గ్యారెంటీ' ప్రారంభించిన ఖర్గే

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం పార్టీ కార్యక్రమం 'ఇంటింటికీ గ్యారెంటీ' ని ప్రారంభించారు. దీనికోసం దేశంలోని 8 కోట్ల కుటుంబాలను చేరుకోవడం, పార్టీకి సంబంధించిన 'హామీలు' పై వారికి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. దేశ రాజధానిలోని ఈశాన్య దిల్లీ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఉస్మాన్‌పూర్, కైత్వాడా నుంచి ఈ కార్యక్రమాన్ని ఖర్గే ప్రారంభించి, 'ఐదు న్యాయ హామీలు' కు చెందిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ 'మా 'ఐదు న్యాయ గ్యారెంటీలు'ను ప్రజలకు చేరువచేసేందుకు గ్యారెంటీ కార్డును పంపిణీ చేస్తున్నాం. దేశంలోని 8 కోట్ల కుటుంబాలకు ఈ కార్యక్రమం చేపట్టాలనుకుంటున్నాం' అని తెలిపారు. 'కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరూ ఈ కార్డును ఇంటింటికీ తీసుకువెళ్లి మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏమి చేస్తుందో ప్రజలకు తెలియజేస్తారు' అని ఆయన చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విమర్శల దాడి చేస్తూ, 'మా ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల కోసమే పని చేస్తుందని, అలాగే చేస్తుందని హామీ ఇస్తున్నాం. ప్రధాని మోదీ గ్యారెంటీ గురించి మాట్లాడతారు. కానీ ఆయన హామీ ప్రజలకు చేరలేదు' అని అన్నారు. ప్రధాన మంత్రి ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల గురించి మాట్లాడతారు. కానీ ప్రజలకు అవి రాలేదు' అని ఖర్గే తెలిపారు. గతంలో తమ ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, ఆర్టీఐ, ఆహార హక్కు, విద్యా హక్కు వంటి హామీలు, కార్యక్రమాలకు సంబంధించి హామీ ఇవ్వనప్పటికీ ఎలా ఇచ్చాయని కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు ఆదాయపన్ను శాఖ అధికారులు నోటీసులు ఇవ్వడంపై ఖర్గే మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మమ్మల్ని భయపెట్టాలని చూస్తోందని, ఐటీ శాఖ మా నిధుల నుంచి రూ.135 కోట్లు తీసుకుందని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి పద్ధతిలో ఎన్నికలు న్యాయబద్ధంగా జరుగుతాయా? అని ప్రశ్నించారు. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నారని, వారు దేశ రాజ్యాంగాన్ని కాపాడాలని కోరుకుంటున్నారని ఆయన నొక్కి చెప్పారు. 'ప్రజలు తమకు అబద్ధాలు, తప్పుదోవ పట్టించే వారికి ఎందుకు ఓటు వేస్తారో నాకు తెలియదు' అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ తన మేనిఫెస్టోను ఏప్రిల్ 5న ఇక్కడ విడుదల చేయనుంది. మరుసటి రోజు జైపూర్, హైదరాబాద్‌లలో భారీ ర్యాలీలను ఉద్దేశించి పార్టీ అగ్ర నేతలు ప్రసంగిస్తారు. సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ ఎన్నికల చిహ్నమైన హస్తాన్ని ప్రస్తావిస్తూ ఆ పార్టీ ఇప్పటికే హాత్ బద్లేగా హలాత్ అనే కొత్త నినాదాన్ని ప్రారంభించింది.

వ్యక్తిపై 'నుహ్' నిందితుడి దాడి

సహకరించిన గోరక్షకుల బృందం, బజరంగ్ దళ సభ్యులు

న్యూదిల్లీ : గత ఏడాది హరియానాలోని నుహ్‌లో జరిగిన హింసాకాండ కేసులో అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చిన బిట్టు బజరంగి, అతని గోరక్షకుల బృందంలోని ఇతరులతో కలిసి ఒక వ్యక్తిని కర్రతో కొట్టడం కెమెరాలో చిక్కుకుంది. అయితే ఒక పోలీసు ఆ వ్యక్తికి చాలా దూరంలో నిలబడి మూగ ప్రేక్షకుడిగా చూస్తూ ఉన్న వీడియో ఒకటి ఇప్పుడు వైరల్‌గా మారింది. దీనిపై పోలీసులు ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు. ఆ వీడియో ఏప్రిల్ 1 నాటిదని, దాడికి గురైన వ్యక్తి ఫరీదాబాద్‌లోని సరూర్‌పూర్ నివాసి అని పోలీసు అధికారులు తెలిపారు. షాము అనే వ్యక్తి తన పొరుగున ఉన్న ఇద్దరు అమ్మాయిలను చాక్లెట్లు ఇస్తానని తన ఇంట్లోకి రప్పించాడని, అతను వారిని లైంగికంగా వేధించడానికి ఉద్దేశించినట్లు స్థానికులు అనుమానించారు. దీంతో అతని ఇరుగుపొరుగు కొందరు ఇంట్లోకి చొరబడి షామును పట్టుకున్నారు. ఈ సంఘటన గురించి వార్తలు వ్యాపించాయి. బజరంగీ గోరక్షకుల బృందం, గోరక్షా బజరంగ్ దళ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని షామును తమతో పాటు ఫరీదాబాద్‌లోని సంజయ్ ఎన్‌క్లేవ్‌లోని తమ నాయకుడి ఇంటికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆ ఇంటి బయట షామును నేలపై ఈడ్చుకెళుతూ అతనిని కర్రతో కొడుతున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపించాయి. ఒక పోలీసు అక్కడే కొద్ది దూరంలో కుర్చీపై కూర్చొని ఉన్నప్పటికీ జోక్యం చేసుకోలేదు. బజరంగీ అలియాస్ రాజ్ కుమార్ అతనిని నాలుగు సార్లు కర్రతో కొట్టాడు. అంతకుముందు అమ్మాయి తల్లి కూడా షామును కర్రతో కొట్టిందని పోలీసు అధికారులు తెలిపారు. సరన్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ ఆఫీసర్ మాట్లాడుతూ 'మేము వైరల్ వీడియోను చూశాము. దాడికి గురైన వ్యక్తి కోసం వెతుకుతున్నాం. మాకు అతని నుంచి ఫిర్యాదు వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటాం. మాకు ఫిర్యాదు రాకపోతే, అతని నుంచి, అలాగే వీడియో, సామాజిక మాధ్యమాలను ఉపయోగించి నిందితులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. హరియానాలోని నుహ్‌లో గత ఏడాది జులైలో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన ఊరేగింపులో మత హింస చెలరేగింది. గురుగ్రామ్, బాద్‌షాపూర్‌తో సహా ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. ఐదుగురు మృతి చెందగా, 70 మంది గాయపడ్డారు. ఒక మసీదుకు కూడా నిప్పు పెట్టారు. మృతులలో ఒక మత గురువు కూడా ఉన్నాడు.

భారత్ వృద్ధి రేటు 7.5 శాతం

ప్రపంచ బ్యాంకు వెల్లడి



న్యూదిల్లీ: ఈ ఏడాది భారత ఆర్థిక వ్యవస్థ 7.5 శాతానికి పెరుగుతుందని ప్రపంచ బ్యాంకు తాజాగా అంచనా వేసింది. ప్రపంచ బ్యాంకు ఇంతకుముందు 6.3 ఉంటుందని అంచనా వేసింది. దీనిని ఇప్పుడు ఏకంగా 7.5కి పెంచింది. గతంలో అంచనా వేసిన దానికంటే ఇది 1.2 శాతం ఎక్కువ. మిడ్ టర్మ్ తర్వాత మళ్లీ 6.6 శాతానికి రావచ్చని తెలిపింది. భారతదేశ వృద్ధి రేటులో ప్రధానంగా సేవా రంగం, పారిశ్రామిక అభివృద్ధి నుంచి వస్తుందని చెప్పింది. మరోవైపు మొత్తం దక్షిణాసియా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి సంబంధించిన అంచనాలను కూడా ప్రపంచ బ్యాంక్ విడుదల చేసింది. ఈ క్రమంలో దక్షిణాసియాలో వృద్ధి రేటు 6 శాతంగా ఉంటుందని తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి సానుకూల ధోరణులు కనిపిస్తున్నందున ఈ అంచనాలు పెంచినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా భారత్ వేగవంతమైన వృద్ధి రేటు కారణంగా పాకిస్థాన్, శ్రీలంక ఆర్థిక వ్యవస్థల్లో మెరుగుదల ఉంటుందని, ఇది దక్షిణాసియా దేశాల మొత్తం వృద్ధి రేటుపై ప్రభావం చూపుతుందని తెలిపింది. ప్రపంచ బ్యాంక్ మంగళవారం దక్షిణాసియా అభివృద్ధిపై తాజా వివరాలు వెల్లడించింది. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం రానున్న రెండేళ్లలో ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధి దక్షిణాసియా ప్రాంతంలోనే ఉంటుందని తెలిపింది. 2025 సంవత్సరంలోనూ దక్షిణాసియా దేశాల మొత్తం వృద్ధి రేటు 6.1 శాతంగా అంచనా వేసింది. మరోవైపు 2024-25 ఆర్థిక సంవత్సరంలో బంగ్లాదేశ్ వృద్ధి రేటు 5.7 శాతం చొప్పున పెరుగుతుందని వెల్లడించింది. మరో దక్షిణాసియా దేశమైన పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడే సూచనలు కనిపిస్తున్నాయని చెప్పింది. ఈ క్రమంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో పాకిస్థాన్ వృద్ధి రేటు 2.3 శాతంగా ఉండవచ్చని తెలిపింది. శ్రీలంకలో 2025లో వృద్ధి రేటు 2.5 శాతంగా ఉంటుందని, శ్రీలంకలో పర్యాటకం, విదేశాల నుంచి వచ్చే డబ్బు పెరిగే సంకేతాలు ఉన్నాయని చెప్పింది.

వామపక్షాల ప్రచారం ఉధృతం

- బీహార్‌లో సత్తా చాటనున్న లెఫ్ట్
- క్షేత్రస్థాయి ప్రచారం ఆరంభం - ఎన్డీయే ఓటమే లక్ష్యంగా ముందుకు
- 'బీహార్ లెనిన్‌గ్రాడ్' సహా ఐదు స్థానాల్లో గెలుపుపై ధీమా

పాట్నా/బెగుసరాయి: బీహార్‌లో వామపక్షాల ప్రచారం ఊపందుకుంది. ఇండియా కూటమిలో భాగంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ఐదు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. బీహార్ లెనిన్‌గ్రాడ్‌గా వ్యవహరించే బెగుసరాయిలో సీపీఐ సత్తా చాటే పరిస్థితి కనిపిస్తోంది. సుమారు 25 ఏళ్ల తర్వాత బీహార్‌లో వామపక్షాలకు గెలుపు అవకాశాలు మరింత మెరుగయ్యాయి. వామపక్షాల విజయం కోసం క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎన్డీయే కూటమిని ఓడించడమే ఏకైక లక్ష్యంగా దూసుకుపోతున్నాయి. అరుణ పతాకం రెపరెపలాడబోతోందన్న విశ్వాసంతో గెలుపుపై దీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ర్యాలీలు, ఆందోళనలు జరిగినా వామపక్షాల సత్తా ఏమిటో తెలుస్తుంది. అక్కడి ప్రజలు వామపక్ష భావజాలాన్ని ఆదరిస్తారు. చాలా ప్రాంతాలు ఎర్ర జెండాను నమ్ముకున్నాయి. కనీసం పదికిపైగా స్థానాల్లో ఎన్నికల ఫలితాలు ప్రభావితం చేయగల సత్తా వామపక్షాలకు, ముఖ్యంగా సీపీఐకు ఉందని రాజకీయ పరిశీలకుల అంచనా. బెగుసరాయి లోక్‌సభ స్థానం నుంచి సీపీఐ పోటీ చేస్తోంది. ఈసారి ముస్లింలు, యాదవ సామాజికవర్గం వామపక్ష అభ్యర్థులకు అండగా నిలిచాయి. బెగుసరాయి వామపక్షాల కుంచుకోట. కమ్యూనిజంతో అనుబంధం వల్ల దీనికి లెనిన్‌గ్రాడ్ ఆఫ్ బీహార్‌గా పేరొచ్చింది. 1920-1930 దశకాల్లో జమిందారీ వ్యవస్థపై పోరాటాన్ని మహాత్మాగాంధీ సత్యాగ్రహం స్ఫూర్తితో కమ్యూనిస్టులు నడిపించారు. నాటి నుంచి కమ్యూనిజం నాటుకుపోయింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లలన్ చౌదరి 'న్యూస్‌క్లిక్'తో మాట్లాడుతూ గత ఎన్నికల మాదిరిగా కాకుండా ఈసారి ఉమ్మడిగా పోటీ చేస్తుండటంతో ఎక్కువ స్థానాలు గెలుచుకోగలమని విశ్వాసంగా చెప్పారు. మార్చి 29న జరిగిన సీట్ల సర్దుబాటుతో ఐదు స్థానాల్లో పోటీ చేసేందుకు మూడు వామపక్ష పార్టీలు అంగీకరించాయి. ఆర్జేడీ 26 స్థానాల్లో, కాంగ్రెస్ తొమ్మిది స్థానాల్లో పోటీ చేయనున్నాయి. అసెంబ్లీలో 11 మంది ఎమ్మెల్యేలున్న సీపీఐ(ఎంఎల్)కు అనేక జిల్లాల్లో ముఖ్యంగా గ్రామీణుల్లో ఆదరణ ఉన్నది. ఈ పార్టీ ఐదు స్థానాల్లో పోటీ చేయాలని భావించింది. ఇద్దరు ఎమ్మెల్యేలు గల సీపీఐ, సీపీఎం కూడా మూడు, నాలుగు స్థానాలు చొప్పున కోరుకున్నాయి. కానీ అవకాశం కుదరలేదు. ఐదు స్థానాల్లో ఉమ్మడి పోటీకి అంగీకారం కుదిరింది.

బెగుసరాయి నుంచి సీపీఐ, ఖగారియా నుంచి సీపీఎం, అర్రా, కరాకత్, నలంద స్థానాల నుంచి సీపీఐ (ఎంఎల్) పోటీ చేస్తున్నాయి. తెఘ్రా, బఖ్రీ అసెంబ్లీ స్థానాలకు సీపీఐ ప్రాతినిధ్యం వహిస్తోంది. ఆర్జేడీ పరిధిలో చెరియా-బరియార్పూర్, సహేబ్‌పూర్ కమల్, జేడీయూ పరిధిలో మతిహాని ఉన్నాయి. బచ్వార, బెగు స్థానాల్లో బీజేపీ ఉంది. బెగుసరాయిలో బీజేపీ అభ్యర్థి గిరిరాజ్ సింగ్‌పై పోటీకి సీపీఐ తరపున అవదేశ్ రాయ్ పోటీ చేస్తున్నారు. రాయ్ అభ్యర్థిత్వం బెగుసరాయి రాజకీయాల్లో మార్పు తేగలదని పార్టీ ఆశిస్తోంది. రాయ్ ఓబీసీ నాయకుడు, బచ్వార నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు కన్హయ కుమార్ సీపీఐ తరపున బెగుసరాయిలో పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్‌లో ఉన్నారు. కాగా, బీహార్‌లోని చాలా ప్రాంతాల్లో సీపీఐ బలమైన రాజకీయ శక్తిగా ఉంది. కనీసం డజను లోక్‌సభ స్థానాలపై వామపక్షాలకు పట్టు ఉన్నదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఆ ప్రాంతాల్లో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల సత్తా ఈ పార్టీలకు ఉన్నట్లు అభిప్రాయపడ్డారు.

పూర్తిస్థాయి విచారణ జరుపుతాం

వీవీప్యాట్ కేసుపై 'సుప్రీం'

న్యూఢిల్లీ: ఎన్నికల్లో వీవీ ప్యాట్ మిషన్లలోని మొత్తం స్లిప్పులు లెక్కించేలా ఆదేశించాలని సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను వచ్చేవారం విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను వచ్చే మంగళ వారం లేదా బుధవారం లిస్ట్ చేస్తామని జస్టిస్ సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం వెల్లడించింది. పిటిషనర్ ఏడీఆర్ తరపున సుప్రీంకోర్టుకు హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పిటిషన్‌ను త్వరగా విచారించాలని డిమాండ్ చేశారు. వీవీప్యాట్లపై దాఖలైన మరో పిటిషన్‌పై స్పందన కోరుతూ ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ కోర్టుకు హాజరై...ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, పిటిషన్‌పై విచారణ జరగకపోతే పిటిషన్లు నిష్ఫలమవుతాయని తెలిపారు. ఈ కేసును జస్టిస్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేషన్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం విచారించింది. పరిస్థితి తమకు తెలుసునని, వచ్చేవారం విచారణ చేపడుతామని ధర్మాసనం పేర్కొంది. ఏడీఆర్ పిటిషన్‌పై గత ఏడాది జులై 17న సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్ స్పందన కోరింది. ఓటర్లు వేసిన ఓటును వీవీప్యాట్ మిషన్ ద్వారా నిర్ధారించుకునేలా ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఏడీఆర్ పిటిషన్‌లో కోరింది. వీవీప్యాట్ స్లిప్పులను ఈవీఎం మెషిన్‌తో సరిపోల్చాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుతం ఎంపిక చేసిన ఐదు ఈవీఎంలకు సంబంధించిన వీవీప్యాట్ స్లిప్‌ల ధ్రువీకరించే విధానం కొనసాగుతున్నది.

'మేమంతా సిద్ధం' నేటి షెడ్యూల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఎనిమిదో రోజు షెడ్యూల్‌ను వైసీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు. సీఎం జగన్ రాత్రికి గురవరాజుపల్లెలో బస చేసిన ప్రాంతం నుంచే గురువారం యాత్ర మొదలవుతుందని చెప్పారు. మల్లవరం, ఏర్పేడు... పనగల్లు, శ్రీకాళహస్తి బైపాస్ మీదగా చిన్న సింగమలకు ఉదయం 11 గంటలకు యాత్ర చేరుకుంటుందన్నారు. అక్కడ లారీ, ఆటో డ్రైవర్లతో ముఖముఖిలో సీఎం పాల్గొంటారని.. ఆపై చావలి చేరుకొని భోజన విరామం తీసుకుంటారని తెలిపారు. సాయంత్రం 3:30 గంటలకు చెన్నై జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన సభలో జగన్ ప్రసంగిస్తారన్నారు. అనంతరం ఓజిలి క్రాస్, బుదనం, గూడూరు బైపాస్, మనుబోలు, నెల్లూరు బైపాస్ మీదుగా చింతరెడ్డి పాలెం చేరుకొని, రాత్రికి అక్కడే బస చేస్తారని రఘురాం వెల్లడించారు.

వలంటీర్ వ్యవస్థకు వ్యతిరేకం కాదు

చంద్రబాబు

విశాలాంధ్ర-అమలాపురం/రావులపాలెం: వలంటీర్ల వ్యవస్థకు తాను వ్యతిరేకం కాదని, కానీ జగన్ అండతో కొందరు వలంటీర్లు చేసే రాజకీయానికి వ్యతిరేకమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం రావులపాలెం సెంటర్‌లో జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో చంద్రబాబు ఉద్వేగంగా ప్రసంగించారు. జగన్ ప్రభుత్వం అమ్మే నాసిరకం మద్యంతో ఆడబిడ్డల తాళిబొట్లు తెగుతున్నాయని విమర్శించారు. బాబాయ్‌ని గొడ్డలితో చంపించి ఆ సానుభూతితో గడిచిన ఎన్నికల్లో జగన్ గెలిచాడని అన్నారు. వలంటీర్లు కొందరు జగన్ అండ చూసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వలంటీర్లు తటస్థంగా ఉండాలని ఆయన కోరారు. వలంటీర్లు రాజకీయం చేస్తే క్షమించనని తెలిపారు. వృద్ధాప్య పింఛన్లు రూ.2 వేలు చేసిన ఘనత తమదని, ఐదేళ్లలో జగన్ కేవలం వెయ్యి రూపాయలు పెంచి మోసం చేశాడని అన్నారు. తాను మళ్లీ గెలిస్తే పింఛన్ రూ.4 వేలు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. జగన్ పాలన అంతా అవినీతిమయం అని ఎద్దేవా చేశారు. వ్యవసాయానికి పూర్తిగా అన్యాయం చేశారన్నారు. రైతులు, రైతు కూలీలు బతికే పరిస్థితులు ఆంధ్ర ప్రదేశ్‌లో లేకుండా చేసారని చంద్రబాబు ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వలేదని, సాగును నాశనం చేశారన్నారు. కరువు కోరల్లో ఉన్న గోదావరి జిల్లాలను ధవళేశ్వరం వద్ద బ్యారేజ్ కట్టి అన్నపూర్ణగా చేసిన కాటన్ దొర ఆశయాన్ని దెబ్బతీసి రైతులకు అన్యాయం చేశారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును 72 శాతం కట్టిన ఘనత తెలుగుదేశానిదేనని అన్నారు. రావులపాలెంలో జగ్గిరెడ్డి చేసిన అవినీతిని చంద్రబాబు దుయ్యబట్టారు. రావులపాలెంలో ఎవరికైనా న్యాయం జరిగిందంటే అది జగ్గిరెడ్డికే అన్నారు. ఆక్వా రంగం జగన్ పాలనలో నాశనం అయిందన్నారు. తాను వచ్చిన వెంటనే ఆక్వా రంగాన్ని ఆదుకుంటానని చెప్పారు. రూపాయన్నరకే యూనిట్ విద్యుత్ ఇస్తానన్నారు. జగన్ అందరినీ నట్టేట ముంచాడని చంద్రబాబు విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఫొటోను టిఫిన్ ప్లేట్స్‌పై ముద్రించి అమ్ముతున్నారని ప్రశ్నించిన దళితులను అరెస్ట్ చేయించి జైలుకు పంపిన దుర్మార్గుడు జగ్గిరెడ్డి అని చంద్రబాబు ఆరోపించారు. సభలో ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దూరదృష్టితో ఆలోచించలేదు...

వయనాడ్‌లో రాహుల్ పోటీపై సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా

వయనాడ్: కేరళలోని వయనాడ్ స్థానం నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీ చేస్తుండటాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా మరోమారు తప్పుపట్టారు. కాంగ్రెస్ దూర దృష్టితో ఆలోచించడం లేదని వ్యాఖ్యానించారు. దేశ భవిష్యత్ కోసం విస్తృత దృక్కోణంతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తమిళనాడు, తెలంగాణ లేక కర్నాటక రాష్ట్రాలలోని ఏదో ఒక నియోజకవర్గాన్ని రాహుల్ ఎంపిక చేసుకొని ఉండాల్సిం దన్నారు. ప్రజలు ఎందుకు ప్రశ్నిస్తున్నారన్నదీ కాంగ్రెస్ ఆలోచించాలని రాజా అన్నారు. సీపీఐ వయనాడ్ అభ్యర్థి అనీ రాజా, కాంగ్రెస్ అభ్యర్థిగా రాహుల్ గాంధీ నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఈ స్థానంలో వీరిద్దరి మధ్య పోటీ నెలకొన్నది. దీనిపై రాజా ఒక వార్తాసంస్థతో మాట్లాడుతూ కాంగ్రెస్ నిర్ణయం సరైనది కాదని, ముందు చూపు లేకుండా వ్యవహరించిందని దుయ్యబట్టారు. వయనాడ్‌లో అనీరాజాపై రాహుల్‌ని కాంగ్రెస్ ఎందుకు పోటీ చేయిస్తోందన్న ప్రజల ప్రశ్నకు ఏం సమాధానం చెబుతారని ఆ పార్టీని నిలదీశారు. 'భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్ర సందర్భంగా బీజేపీ, దాని సిద్ధాంతాలపైనా తన పోరాటమన్న రాహుల్... ఎన్నికలు వచ్చేసరికి ఆ పార్టీతో ప్రత్యక్ష పోరుకు ఎందుకు దిగలేదు? సీపీఐపై పోటీ ఎందుకు? దీంతో కాంగ్రెస్ ఎలాంటి సందేశమివ్వాలని అనుకుంటోంది?' అని రాజా ప్రశ్నించారు. కేరళలో ఎల్డీఎఫ్ సంకీర్ణంలో సీపీఐ ఉంది. రాష్ట్రంలోని 20 స్థానాలకు ఈనెల 26న ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు జూన్ 4న వెలువడతాయి. కేరళలో కాంగ్రెస్‌కు మంచి పట్టు ఉంది. లోక్‌సభలో 20 మంది ఎంపీలు ఈ రాష్ట్రం వారే ఉన్నారు. కేరళలో ప్రత్యక్ష పోరుకు సిద్ధమైన సీపీఐ, కాంగ్రెస్... జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగంగా ఉన్న విషయం తెలిసిందే.

నక్సల్స్ ఏరివేతలో భారీ విజయం

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌పై బస్తర్ రేంజ్ ఐజీ

13కు పెరిగిన మృతుల సంఖ్య

బీజాపూర్: చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల సంఖ్య 13కి పెరిగింది. భద్రతాదళాలకు, నక్సల్స్ మధ్య నిన్నటి నుంచి హోరాహోరీ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం మొదలైన ఈ ఎన్‌కౌంటర్ బుధవారంతో ముగిసినట్లు భద్రతా బలగాలు అధికారిక ప్రకటనలో తెలిపాయి. పెద్దసంఖ్యలో మావోయిస్టులు గాయపడినందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పాయి. బీజాపూర్ ఎన్‌కౌంటర్ వివరాలను బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ తెలియజేస్తూ నక్సల్స్ ఏరివేత ఆపరేషన్లలో ఇది పెద్ద విజయమని అన్నారు. గంగలూరులో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో వెయ్యిమందికి పైగా భద్రతా బలగాలు పాల్గొన్నట్లు చెప్పారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో కొనసాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 13 మంది నక్సల్స్ హతమయ్యారని, వారి మృతదేహాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పెద్ద సంఖ్యలో నక్సల్స్ గాయపడినట్టు సమాచారం ఉందన్నారు. ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్న ప్రాంతం నక్సల్స్‌కు సురక్షిత ప్రాంతంగా ఉందని, మూడు నెలల్లో కొత్తగా 16 భద్రతా శిబిరాలు ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు. బలగాలు సుమారు 20 కిలోమీటర్ల మేర అడవులు, పర్వతాల మీదుగా బలగాలు ప్రయాణించి, నైట్ విజన్ బైనాక్యులర్లు, అధునాతన ఆయుధాలతో ఈ ఆపరేషన్ నిర్వహించినట్టు చెప్పారు. పశ్చిమ బస్తర్ డివిజన్ గంగలూర్ ఏరియా కమిటీకి చెందిన కంపెనీ-2 ఇచ్చిన సమాచారంతో గాలింపు చర్యలు చేపట్టామని, నక్సలైట్ ఆర్గనైజేషన్‌లో నెంబర్ 2గా అత్యంత శక్తివంతమైన గ్రూప్‌ను బీజాపూర్ జిల్లాలో కనుగొన్నామని ఐజీ చెప్పారు. రెండు రాత్రుల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో మంగళవారం వరకూ 10 మంది నక్సల్స్ మృతదేహాలను, బుధవారం ఉదయం మరో 3 మృతదేహాలను, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మృతులలో మహిళలు కూడా ఉన్నట్టు చెప్పారు.

శ్రీనివాసులును హత్య చేసిన భూకబ్జాదారులను అరెస్టు చేయాలి

- సీఈఓకు ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: కడప జిల్లా పెండ్లిమర్రి మండలం, యాదవపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేసిన భూకబ్జాదారులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, భూ సమస్యను పరిష్కరించకుండా అలసత్యం ప్రదర్శించి, శ్రీనివాసులు కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురిచేసిన రెవెన్యూ, పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకు లేఖ రాశారు. కడప జిల్లాలో భూ కబ్జాదారుల దౌర్జన్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఆదిమూలం శ్రీనివాసులును ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అనుచరులు, వైసీపీ మూకలు అత్యంత కిరాతకంగా చంపారని, నిందితులను కఠినంగా శిక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్ చేస్తోందన్నారు. ఎన్నికల కాలంలో వైసీపీ శ్రేణులు బలహీన వర్గాలపై హత్యలు, అరాచకాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనివాసులు హత్యకు గురవ్వగా ఘటన స్థలానికి వచ్చిన ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి గ్రామస్తులను, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి అసలైన నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎస్ఐ సునీల్‌కుమార్ రెడ్డి నిందితుల సొంత ఇంటిలో అద్దె లేకుండా నివాసముంటూ, అన్ని సౌకర్యాలు పొందుతూ కులాభిమానంతో నిందితులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇటువంటి ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేసి, ఉన్నతాధికారులతో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సీఈఓకు రాసిన ఈ లేఖ ప్రతులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి కూడా పంపించారు.

మహారాష్ట్ర ప్రచార బరిలో ఖడ్గే, రాహుల్, ప్రియాంక

ముంబై: సార్వత్రిక ఎన్నికల తొలి దశ ప్రచారానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సిద్ధమయ్యారు. ఈనెల 8 లేక 9న రామ్‌టెక్‌లో ఖడ్గే ప్రచారాన్ని చేపట్టనున్నట్లు పార్టీ అధికార ప్రతినిధి అతుల్ వెల్లడించారు. అలాగే ఈనెల 13న భండారా- గోండియా నియోజకవర్గంలో రాహుల్, 15న చంద్రాపూర్‌లో ప్రియాంక ప్రచారం చేస్తారన్నారు. తొలి దశలో భాగంగా ఈనెల 19న రామ్‌టెక్, నాగ్‌పూర్, చంద్రాపూర్, భండారా-గోండియా, గడ్చిరోలి-చిమూర్ నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతుంది. రామ్‌టెక్ మినహా మిగతా నాలుగు స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ ఏర్పడింది. రామ్‌టెక్‌లో శివసేన (ఏక్‌నాథ్ షిండే) తరపున రాజు పర్వే (కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే) పోటీ చేస్తున్నారు. నాగపూర్‌లో నితిన్ గడ్కరీ (బీజేపీ), చంద్రాపూర్‌లో సుధీర్ ముంగంటివార్ (బీజేపీ) ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. మహారాష్ట్రలో మొత్తం 48 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి.

మోదీకి ప్రత్యామ్నాయంపై థరూర్ స్పందన

తిరువనంతపురం: దేశంలో లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలైంది. ఏప్రిల్ 19న మొదటి దశ పోలింగ్ జరగనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. ఈ క్రమంలోనే కేరళ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు తన ప్రచారంలో భాగంగా మీడియా నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. మరోసారి ఓ జర్నలిస్ట్ ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయం ఎవరని అడిగారని శశి థరూర్ సోషల్ మీడియా వేదిగా వెల్లడించారు. దీనికి సమాధానం తనదైన శైలిలో చెప్పారు. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రధాని నరేంద్ర మోదీ స్థానంలో ఎవరు ఉండాలనే ప్రశ్న అసంబద్ధమైనదని అన్నారు. అధ్యక్ష వ్యవస్థలో మాదిరిగా మనం ఎన్నుకోవడం లేదన్నారు. మేము ఏ ఒక్కరినీ ఎన్నుకోవడం లేదని, పార్టీని లేదా పార్టీల కూటమిని ఎన్నుకుంటామని ఆయన చెప్పారు. ప్రధానమంత్రికి పోటీ ఎవరంటే అనుభవజ్ఞుడైన, సమర్థుడైన ప్రజల సమస్యలపై స్పందించే అహంభావం లేని నాయకులేనని చెప్పారు. ప్రధానిగా ఎవరిని ఎంచుకుంటామనేది తర్వాత విషయమని వెల్లడించారు. మన ప్రజాస్వామ్యాన్ని, భిన్నత్వాన్ని పరిరక్షించడమే తమ మొదటి ప్రాధాన్యత అని శశిథరూర్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఇండియా కూటమిలో ఎవరు ప్రధానమంత్రి అభ్యర్థి అనేది చర్చనీయాంశంగా మారింది. కేరళలోని తిరువనంతపురం నుంచి శశిథరూర్ మూడు సార్లు ఎంపీగా గెలిచి, నాలుగోసారి ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈ స్థానం నుంచి ఆయనకు పోటీగా బీజేపీ అభ్యర్థి రాజీవ్ చంద్రశేఖర్, లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థి పన్నయన్ రవీంద్రన్‌లు బరిలోకి దిగుతున్నారు. తిరువనంతపురంలో ఏప్రిల్ 26న రెండో విడత పోలింగ్ జరగనుంది. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- డబ్బు, మద్యం ప్రభావం నియంత్రించండి
- నిర్భయంగా ఓటు వేసేలా పోలింగ్ కేంద్రాలు
- జల, రోడ్డు, వాయు మార్గాల్లో నిఘా కట్టుదిట్టం చేయాలి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్
- సీఎస్, డీజీపీ, సీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: త్వరలో జరగనున్న పార్లమెంట్, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా శాంతియుతంగా, హింసా రహితంగా నిర్వహించడమే లక్ష్యంగా పని చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల యంత్రాగానికి స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలకు సంబంధించి శాంతి భద్రతలు, భద్రతా బలగాల మోహరింపు, ఎన్నికల వ్యయ నిర్వహణ సెన్సిటివిటీ, నోడల్ అధికారుల నియామకం, నోటిఫికేషన్ ఆఫ్ డ్రై డే, పెయిడ్ హాలిడే, అంతర్జాతీయ సరిహద్దు అంశాలపై బుధవారం దిల్లీ నుంచి సహచర ఎన్నికల కమిషనర్లతో కలిసి సీఈసీ రాజీవ్ కుమార్ వివిధ రాష్ట్రాల సీఎస్, డీజీపీ, సీఈఓలు తదితర అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఎన్నికలు ఏవిధంగా జరుగుతున్నాయని ప్రపంచ దేశాలన్నీ మనవైపు చూస్తున్నాయని, రానున్న ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా హింసా రహితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలకు పునరుద్ఘాటించారు. ఇప్పటికే మొదటి, రెండవ దశ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్లు జారీ అయ్యాయని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, డ్రగ్స్ వంటి వాటితో ఓటర్లను ప్రభావితం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలు ఎక్కడైనా తనిఖీల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జిల్లా యంత్రాంగాలు తగిన చర్యలు తీసుకోవాలని రాజీవ్ కుమార్ ఆదేశించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు(సైలెంట్ పిరియడ్) ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బు, మద్యం వంటి తాయిలాల పంపిణీకి ప్రయత్నాలు జరుగుతాయని, అలాంటి చర్యలను కట్టుదిట్టంగా నియంత్రించేందుకు మోడల్ కోడ్ బృందాలు మరింత నిఘా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. రానున్న ఎన్నికలను సజావుగా, సక్రమంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని విధాలా కట్టుబడి పూర్తి సన్నద్ధమై ఉందని, ఈ ప్రక్రియలో అన్ని రాష్ట్రాలు పూర్తి సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని రాజీవ్ కుమార్ సూచించారు. ఎన్నికల్లో అన్ని పార్టీలకు వివిధ అంశాల్లో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఎక్కడా రీ పోలింగ్‌కు అవకాశం లేని విధంగా ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు.

వీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్ట అమలుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు 258 కోట్ల రూపాయల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. రాష్ట్రంతో ఐదు రాష్ట్రాలు అంతర్ రాష్ట్ర సరిహద్దులను కలిగి ఉన్నాయని, రాష్ట్ర సరిహద్దుల్లో 150 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత, స్వేచ్ఛాయుత, హింసా రహిత ఎన్నికల నిర్వహణకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శాంతి భద్రతల అంశానికి సంబంధించి సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి కొంత మేర మావోయిస్టుల సమస్య ఉందని, ఆ సమస్యను అధిగమించేందుకు భద్రతా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో 132 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, 632 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పని చేస్తున్నాయని సీఎస్ వివరించారు.

డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఒడిశా చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కొంత వరకు మావోయిస్టుల ప్రాబల్యం ఉందని, ఇందుకు సంబంధించి 91 పోలింగ్ కేంద్రాలను గుర్తించి భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల మహారాష్ట్రకు 10 కంపెనీల పోలీసు బలగాలను పంపామని, వాటిని తిరిగి పంపాలని కోరారు. రాష్ట్రానికి అదనపు బలగాలు పంపాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. వీడియో సమావేశంలో సీఈవో ముకేశ్ కుమార్ మీనా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నీరబ్ కుమార్ ప్రసాద్, రజత్ భార్గవ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్త, అదనపు డీజీపీ ఎస్.బాగ్చి, చీఫ్ కమిషనర్ స్టేట్ టాక్స్ గిరిజా శంకర్, ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, ఎస్ఈబీ డైరెక్టర్ ఎం.రవి ప్రకాశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఎంకే, అన్నా డీఎంకేతో పొత్తు పెట్టుకోం: అన్బుమణి

చెన్నై: భవిష్యత్తులోనూ డీఎంకే, అన్నాడీఎంకేలతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ ప్రకటించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పొత్తు పెట్టుకోవడంపై తన తండ్రి రాందాస్‌కు, తనకు మధ్య భిన్నాభిప్రాయాలు పొడచూపలేదని, కానీ సోషల్ మీడియాలో దీనిపై లేనిపోని తప్పుడు కథనాలు వైరల్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగం దిండివనం సమీపంలో ఉన్న తైలావరం గార్డెన్‌లో తన తండ్రి రాందాస్‌తో భేటీ అయ్యాక ఈ కథనాలు ప్రసారమయ్యాయని వివరించారు.

ఐదు ఎన్జీవోల ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దు

చట్టాన్ని ఉల్లంఘించినందుకే: హోంశాఖ

న్యూఢిల్లీ: ఎఫ్‌సీఆర్ఏ (విదేశీ విరాళాల నియంత్రణ చట్టం) నిబంధనలు ఉల్లంఘించారన్న కారణం చూపుతూ ఐదు ఎన్జీవోల రిజిస్ట్రేషన్‌ను కేంద్ర హోంశాఖ బుధవారం రద్దు చేసింది. లైసెన్సులు కోల్పోయిన ఎన్జీవోల్లో... సీఎన్ఐ సైనోడికల్ బోర్డ్ ఆఫ్ సోషల్ సర్వీస్, వలంటరీ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండో-గ్లోబల్ సోషల్ సర్వీస్ సొసైటీ, చర్చ్ ఆక్సిలరీ ఫర్ సోషల్ యాక్షన్, ఇవాంగెలికల్ ఫెల్లోషిప్ ఆఫ్ ఇండియా ఉన్నాయి. ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలకు విరుద్ధమైన కార్యకలాపాలను చేపట్టినందుకు ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు హోంశాఖ వర్గాలు తెలిపాయి. అయితే 2023, జులై 17 వరకు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సులు పొందిన ఎన్జీవోల సంఖ్య 16,301గా ఉంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.